ప్రజాశక్తి
సోమవారం 15 సెప్టెంబర్ 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉక్కు ఉద్యోగికి జీతమేదీ ?

◆ 15 రోజులైనా అందని వేతనం
◆ గతేడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకూ 430 శాతం బకాయి ◆ ఆర్థిక ఇబ్బందుల్లో ఉద్యోగులు
◆ నేడు స్టీల్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద కంచాలతో వినూత్న నిరసన

వేతనాలు చెల్లించాలని ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-ఉక్కునగరం

విశాఖ ఉక్కు ఉద్యోగికి ఇప్పటికీ నెల వేతనం అందలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయానికి ముందు ఎప్పటి వేతనాలు అప్పుడే సక్రమంగా అందేవి. కేంద్రంలోని మోడీ సర్కారు ప్లాంట్ అమ్మకం నిర్ణయం ప్రకటించిన నుంచీ ఉద్యోగులకు అవస్థలు తప్పడం లేదు. ఏదో ఒక రూపంలో వారి ప్రయోజనాలకు కేంద్ర ప్రభుత్వం ఎసరు పెడుతోంది. వారిని తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులకు గురిచేసి, మానేసేలా చేసి కర్మాగారాన్ని ప్రైవేటుకు అప్పగించే ఆలోచనలో ఉందన్న విమర్శలున్నాయి. 2024 సెప్టెంబర్ నుంచి 430 శాతం మేర జీతాల బకాయి ఇప్పటి వరకూ ఉంది. ఉక్కు ఉద్యోగి పూర్తి జీతం తీసుకుని చాలా కాలమే అయింది.

స్టీల్‌ప్లాంట్‌లో 18 వేల మంది రెగ్యులర్ కార్మికులు, మరో 18 వేల మంది వరకూ కాంట్రాక్టు కార్మికులు, అనుబంధ పరిశ్రమలపై ఆధారపడి మరో 25 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరు ఉత్పత్తిలో భాగస్వామ్యమవుతున్నా నెలనెలా జీతాలు అందడం లేదు. బ్లాస్ట్ ఫర్నేస్-3ని ప్రారంభించి ఉత్పత్తి పెంచుతామని ప్రభుత్వం, యాజమాన్యం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.11400 కోట్ల ప్యాకేజీలో ఉక్కు కార్మికులకు పావలా కూడా చేరలేదు. వేతనాల చెల్లింపుల్లో జాప్యం ఇంకా వీడలేదు. ఉక్కు ఉద్యోగులు వేతన సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఇప్పటికే లేఖ రాశారు. కార్మికులు, మిగతా 2లో..

సూపర్ బజార్‌కు పూర్వ వైభవం

◆ నాణ్యమైన సరుకులను సరసమైన ధరలకు అందించడమే లక్ష్యం
◆ 'ప్రజాశక్తి'తో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీరామమూర్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

నాణ్యమైన సరుకులను సరసమైన ధరలకు అందిస్తూ నగరవాసుల ఆదరణ చూరగొన్న సూపర్ బజార్‌కు పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని సూపర్ బజార్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పి.శ్రీరామమూర్తి తెలిపారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

గతంలో ప్రజల ఆదరణ పొందిన సూపర్ బజార్ పరిస్థితి దారుణంగా తయారైందన్న వాఖ్యలపై మీరేమంటారు ?

ఆ వాఖ్యలు వాస్తవం. సూపర్ బజార్ ప్రజలకు నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు ఎల్లవేళలా అందించాలి. సంస్థ ఆర్థిక ఇబ్బందులు లేకుండా నడవడానికి ఇతర వ్యాపారాలు కూడా చేయవలసి ఉంటుంది.

నష్టాలకు కారణాలను గుర్తించారా ?

సూపర్ బజార్‌కు వస్తున్న బియ్యం, పప్పు దినుసులు వగైరా సరుకులను స్థానికంగా హోల్ సేల్ మార్కెట్ నుండి కొనుగోలు చేసి అమ్మకాలు చేస్తున్నట్లు సిబ్బంది ద్వారా తెలిసింది. ఇందువల్ల లాభాలు తక్కువగా వస్తున్నాయని గమనించాను.

ప్రత్యామ్నాయం చూశారా ?

సరుకులను హోల్‌సేల్ వ్యాపార సంస్థల నుంచి కాకుండా, ఇ- టెండర్ ద్వారా కొనుగోలు చేస్తాం. అందువల్ల లాభాలు పెరిగే అవకాశముంది.

నగరంలో షాపింగ్ మాల్స్ రావడం వల్ల సూపర్ బజార్ వ్యాపారానికి నష్టం కలుగుతోందా ?

సూపర్ బజార్ సిబ్బంది ఇదే మాట చెప్పారు. అది సరికాదు. నగరంలో ఉన్న షాపింగ్ మాల్స్ అన్నీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. భారీ స్థాయిలో అద్దె చెల్లించాల్సి ఉంటుంది. సూపర్ బజార్‌కు ఆ ఇబ్బంది లేదు. సొంత భవనాలు ఉన్నాయి. కనుక అద్దె భారం ఉండదు. కనుక లాభాలకు ఢోకా ఉండదు.

రైతు బజార్లలో సూపర్ మిగతా 2లో..

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

▶ వార్త 6లో..

మెగా అర్బన్ లేఅవుట్‌లో ఖాళీ స్థలాలు కబ్జా

▶ వార్త 5లో..

తెగిన వారధి.. తాటి దుంగలే దారి

▶ వార్త 5లో..

సారథ్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెపి నడ్డా తదితరులు

రాష్ట్రానికి సహకారం

బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా వార్త మెయిన్‌లో..

ద్రోహాన్ని కప్పిపెట్టి ప్రగల్భాలా ?

◆ బిజెపి రాష్ట్ర అధ్యక్షుని తీరు సిగ్గుచేటు ◆ ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం చేసి గొప్పలు పోవడం దారుణం
◆ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సారథ్యం పేరుతో విశాఖలో బిజెపి నిర్వహించిన బహిరంగ సభలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్.మాధవ్ విశాఖ, ఉత్తరాంధ్ర ప్రజలకు కేంద్ర బిజెపి చేసిన ద్రోహాన్ని కప్పిపెట్టి అభివృద్ధి ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో తీవ్రస్థాయిలో విమర్శించారు. విశాఖ ఉక్కుకు 11,440 కోట్లు ఆర్థిక సహాయం ప్రకటించి మోడీ ప్రభుత్వం ప్లాంటును ఆదుకుందని మాధవ్ ప్రకటించారన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్టీల్‌ప్లాంట్లకు గనులు కేటాయించి విశాఖ ఉక్కుకు మాత్రమే సొంత గనులు కేటాయించకుండా కేంద్రం నష్టాల పాలు చేసిందని జగ్గునాయుడు తెలిపారు. స్ట్రాటజిక్ సేల్ పేరుతో 100 శాతం అమ్మకానికి పెట్టిన మోడీ సర్కారు రెండు వేల మంది పర్మినెంట్ కార్మికులను, ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్లాంట్‌లోని ఆరు వేల ఉద్యోగ ఖాళీలు నింపకుండా, నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వకుండా, ఇఒఐ పేరుతో ఆపరేషన్‌తో సహా కీలక డిపార్టుమెంట్లను 46 ముక్కలు చేసి ప్రైవేటీకరించ పూనుకోవడం దారుణమన్నారు. ప్లాంట్ రక్షణ కవచాలైన ఫైర్ అండ్ సేఫ్టీ, సిఐఎస్ఎఫ్ విభాగాలను సైతం ప్రైవేటీకరించడం విశాఖ ఉక్కును ఆదుకోవడమా, ధ్వంసం చేయడమా అని జగ్గునాయుడు ప్రశ్నించారు. కేంద్రం రూ.11440 కోట్ల నిధులు ఇచ్చినట్టే ఇచ్చి, రూ.9,842 కోట్లును జిఎస్‌టి, బ్యాంకుల రుణాల పేరుతో తిరిగి తన ఖాతాలో వేసుకొని, మిగతా నిధులు యంత్రాలు, ముడి సరుకు, కార్మికుల జీతాలకు ఖర్చు చేయరాదని నిబంధన విధించడం స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవడమా, అగాధంలోకి నెట్టడమా అని అడిగారు. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ సాధన కోసం జరిగిన ఉద్యమానికి తలొగ్గి పది సంవత్సరాల తర్వాత రైల్వే జోన్ ప్రకటించారని తెలిపారు. సంవత్సరానికి సుమారు రూ.10 వేల కోట్ల ఆదాయం సమకూరుస్తున్న వాల్తేర్ డివిజన్ పరిధిలోని (కొత్తవలస కిరండోల్) కెకె లైన్‌ను ఒడిస్సా రాష్ట్రం రాయగడ జోన్‌లో కలిపేశారని, ఇది విశాఖ, ఉత్తరాంధ్ర ప్రజలకు కేంద్ర బిజెపి చేసిన ద్రోహం కాదా అని ప్రశ్నించారు. అత్యంత విలువైన రైల్వే స్టేషన్లు, ట్రాకులు, భూములను కార్పొరేట్లకు, ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్నారన్నారు. సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు వినియోగించే రైళ్లను, కోచ్‌లను భారీగా తగ్గించారన్నారు. ఆ తరగతుల ప్రజానీకం గత్యంతరం లేక, అధిక మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉక్కు ఉద్యోగికి జీతమేదీ ?

కార్మిక సంఘాల నేతలు వేతనాల చెల్లింపుల కోసం ఆందోళనలు, ధర్నాలు చేపడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం చలించడం లేదు. గతంలో లేబర్ కమిషన్ ఎదుట ఒప్పుకున్న హెచ్‌ఆర్‌ఎ చెల్లించడంలో కూడా జాప్యం జరుగుతోంది. ఉక్కునగరంలో ఉంటున్న కార్మికులకు విద్యుత్ ఛార్జీలు పెంచడమే కాకుండా అనేక ఆంక్షలు విధించారు.

ఫీజులు కట్టలేక.. వడ్డీ భారాలు మోయలేక..

వేతనాల చెల్లింపులు ఆలస్యం కావడంతో పిల్లలకు కాలేజీ ఫీజులు కట్టలేకపోతున్నామని, ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న ఇఎంఐలకు వడ్డీ భారాలు మరింత పెరుగుతున్నాయని, కారు లోన్ ఇతర బకాయిలు పెరిగి కోలుకోలేని స్థితికి చేరుకున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూరగాయలు, నిత్యావసరాలు, విద్యుత్ ఛార్జీలతో సహా అన్ని ధరలు పెరిగిన విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. వేతనం అందక కార్మికులు ఇంతలా ఇబ్బంది పడుతుంటే రాష్ట్రానికి చెందిన కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడుతూ కార్మికులకు జీతాల బకాయి లేదంటూ చెప్పడం గమనార్హం. తమకు జీతాలు చెల్లించాలంటూ సోమవారం ఉక్కు ఉద్యోగులు, కార్మికులు స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద కంచాలతో వినూత్న నిరసనకు దిగుతున్నారు. కార్మికులు, వారి కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి పిలుపునిచ్చారు.

ద్రోహాన్ని కప్పిపెట్టి ప్రగల్భాలా ?

ఛార్జీలు చెల్లించి వందే భారత్ వంటి రైళ్లలో ప్రయాణించేలా నెట్టడం అభివృద్ధా అని నిలదీశారు. అమృతం కార్పొరేట్లకు ఇచ్చి, కష్టాలు, భారాలు ప్రజలకు ఇవ్వడం అభివృద్ధా ? అని ప్రశ్నించారు.

విశాఖపట్నం అభివృద్ధికి మూలం విశాఖపట్నం పోర్టు, ప్రభుత్వ రంగ సంస్థలు అని జగ్గు నాయుడు తెలిపారు. విశాఖపట్నం పోర్టు బెర్తులను కార్పొరేట్లకు కట్టబెట్టి, చివరకు ప్లాటినం జూబ్లీ ఆసుపత్రిని సైతం ప్రైవేట్‌కు కట్టబెట్టడానికి పూనుకోవడం, పోర్టును కార్పొరేట్లకు భూములు, సదుపాయాలు కల్పించే ఫెసిలిటేటర్ స్థితికి మోడీ ప్రభుత్వం దిగజార్చడం అభివృద్ధా, వినాశనమా అని ప్రశ్నించారు. దేశ రక్షణ రంగంలో కీలకమైన నౌకల నిర్మాణాలు, మరమ్మతులు, పరికరాల తయారీ తదితర అనేక విభాగాలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. భద్రతా దళాల నియామకంలోనూ ప్రైవేటీకరణే జరుగుతోందన్నారు. అగ్ని వీర్ పేరుతో కాంట్రాక్ట్ సైనిక నియామకాలు చేపడుతున్నారన్నారు. దేశ భద్రత, రక్షణను పణంగా పెడుతున్నారని, ఇదేనా మోడీ ప్రభుత్వ దేశభక్తి, అభివృద్ధి అని ప్రశ్నించారు. బ్రిటిష్ కాలం నుండి కార్మిక వర్గం అశేష త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను కార్పొరేట్ల కాళ్ల కింద కట్టు బానిసలుగా తయారు చేయడానికి పూనుకున్నారన్నారు. మోడీ ప్రభుత్వం, రాష్ట్ర కూటమి డబుల్ ఇంజన్ సర్కార్‌లు సంపద సృష్టికర్తలైన కార్మికులకు, శ్రామికులకు చట్టాలు, హక్కులు లేకుండా చేసి, కార్పొరేట్ల దోపిడీకి ఆటంకం లేకుండా చేస్తే రాష్ట్ర అభివృద్ధి పరుగులు తీస్తుందా ? అన్నారు.

ఆంధ్ర రాష్ట్ర పునర్విభజన చట్టంలోని కీలక అంశాలను నేటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. విశాఖ మెట్రో రైలు హడావిడి తప్ప ఇంతవరకు నిర్మాణానికి నోచుకోలేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతుల పంటలకు నేటికీ గిట్టుబాటు ధరలు ప్రకటించలేదని, అన్నం పెట్టే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. విశాఖ, ఉత్తరాంధ్ర సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయింపుల విషయంలో వివక్షత కొనసాగుతోందని చెప్పారు. ఇలా అనేక అంశాల్లో కేంద్ర మోడీ ప్రభుత్వం విశాఖకు, ఉత్తరాంధ్రకు తీవ్ర ద్రోహం చేస్తోందన్నారు. ఆ విషయాన్ని కప్పిపుచ్చి, మాధవ్ అభివృద్ధి ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రజా ద్రోహాన్ని ఆపి, విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం, విశాఖపట్నం, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు.

సూపర్ బజార్‌కు పూర్వ వైభవం

బజార్ కౌంటర్లు ఉన్నాయి.. వాటి పరిస్థితేంటి ?

రైతు బజార్లలో ఉన్న సూపర్ బజార్ కౌంటర్లు నష్టాలలో ఉన్నట్లు గుర్తించాం. వాటిని రద్దు చేయాలా, కొనసాగించాలా, కొనసాగిస్తే లాభాలు వచ్చేలా వాటిని ఎలా నిర్వహించాలి ? అన్న విషయాలను ఆలోచిస్తున్నాం.

సిబ్బంది పనితీరు ఎలా ఉంది ?

సిబ్బంది మరింత అంకితభావంతో పని చేయాలి. సంస్థ అభివృద్ధి చెందాలన్నా, ప్రగతి మార్గంలో నడవాలన్నా సిబ్బంది సహకారం ఎంతో అవసరం. అదే సందర్భంలో వారి సంక్షేమాన్ని కూడా గమనించవలసి ఉంటుంది.

సూపర్ బజార్ నిర్వహణ మీకు కొత్త అనుకుంటా..?

నిజమే. శాఖలో ఎసిటిఒగా, ఆ తర్వాత సహకార శాఖలో చేరి డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్‌గా, డిఆర్‌డిఎ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా, జివిఎంసి జోన్ 7 (అనకాపల్లి) జోనల్ కమిషనర్‌గా, విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ సిఇఒగా, పార్వతీపురం మన్యం జిల్లా సహకార శాఖ అధికారిగా పనిచేసి ప్రస్తుతం సూపర్ బజార్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం జరిగింది. వివిధ శాఖలలో, వివిధ హోదాలలో పనిచేసిన అనుభవం వల్ల సూపర్ బజార్ ఎమ్‌డిగా పనిచేయడం కష్టంగా ఉండకపోవచ్చు. ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ సంస్థ పురోగతికి కృషి చేస్తాను.

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బిసి అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం జిల్లా పర్యటనలో భాగంగా బిసి నాయకులు, అధికారులతో కలిసి పాత పోస్టాఫీసు ఏరియాలోని ప్రభుత్వ బిసి బాలికల కళాశాల సంక్షేమ వసతిగృహాన్ని ఆయన సందర్శించారు.

1630వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ పోరాటానికి పబ్లిక్ సెక్టార్ తొలినుంచి సంపూర్ణ మద్దతు ఇస్తోందని బిహెచ్ఇఎల్ సిఐటియు యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.టి.పి ప్రకాష్ తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు ఆదివారం 1630 రోజుకు చేరాయి. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రకాష్ మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం చేపట్టే కార్యక్రమాలు ఎక్కడ ఉన్నా పబ్లిక్ సెక్టార్ మద్దతు ఉంటుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన 5వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రైవేటీకరణ చర్యను వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ నుంచి ప్రసాదు, ఎల్ఐసి నుంచి వరప్రసాద్, జగన్నాథరావు పాల్గొన్నారు.

దీక్షల్లో కూర్చున్న ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, కార్మికులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : పెండింగ్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు విన్నవించారు. జివిఎంసి సాధారణ పద్దుల్లో భాగంగా గత ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకూ సుమారు రూ. 420కోట్లు బిల్లుల బకాయిలు ఉన్నాయని వాటిలో కనీసం ఆరు నెలల బకాయి బిల్లులైనా చెల్లించేలా చూడాలని కోరారు. ఇటీవల ఎపి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఎంఎస్ఎంఇ ద్వారా డిస్కౌంట్ బిల్లుల పేరిట చెల్లింపులు చేసేందుకు అవకాశం ఇచ్చిందని, ఆ విభాగ సిబ్బంది కూడా సహకరిస్తామని చెప్పిన విషయాన్ని కాంట్రాక్టర్లు గుర్తు చేశారు. ఆ ప్లాట్‌ఫారం ద్వారా బిల్లులు చెల్లించేందుకు ఇప్పటికే జివిఎంసి అదనపు కమిషనర్ తమ అనుమతి కోరారని, సమ్మతి తెలియజేశామని కాంట్రాక్టర్లు తెలియజేశారు. కనీసం 6 నెలల బిల్లు అయినా చెల్లించాలని లేనిపక్షంలో పనులు చేయడం కష్ట సాధ్యమవుతుందని కాంట్రాక్టర్లు వాపోయారు. కాంట్రాక్టర్స్ సంఘం అధ్యక్షులు పివివి.నాగరాజు, ప్రధానకార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, జి.సింహాచలం పాల్గొన్నారు.

మంత్రి కొండపల్లితో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

తల్లి చెంతకు ఒడిశా గృహిణి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భర్తతో గొడవపడి విశాఖ వచ్చిన ఒడిశా యువతిని ఆమె తల్లికి అప్పగించినట్టు ఎయిటిడి కార్యదర్శి ప్రగడ వాసు మీడియాకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ సమీపంలోని తాయాపుట్ గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి రోస్ మెర్రీ క్రేత్రియాకు పెళ్లి అయ్యి ఏడాది అవుతోంది. ఇంతలో భర్తతో గొడవ పడి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రైలు ఎక్కి నేరుగా విశాఖపట్నం వచ్చేసింది. ఈమెను రైల్వేస్టేషన్‌లో జిఆర్పి కానిస్టేబుల్ నారాయణరావు చూసి మహిళా కానిస్టేబుల్ పూజితతో కలసి జివియంసి టిఎస్ఆర్ కాంప్లెక్స్ మహిళా వసతిగృహానికి తీసుకువచ్చినట్టు తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం ఎంతగానో తోడ్పడుతుందని మాక్స్ హెల్త్‌కేర్ వద్ద డైటెటిక్స్ రీజనల్ హెడ్ రితికా సమద్దర్ అన్నారు. కాలిఫోర్నియా బాదం వంటి పోషకాలు అధికంగా ఉండే పదార్థాలు మెరుగ్గా శక్తిని నిర్వహించడానికి, జీర్ణక్రియకు సహాయపడటానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఒక హోటల్లో ఆమె మీడియాతో మాట్లాడుతూ బాదం వినియోగిస్తే 9 రోజుల పాటు ఆరోగ్యాన్ని ప్రోత్సహించ డానికి సహాయపడుతుందన్నారు. బాదంలో సమకాలీన పోషక అవసరాలకు అనుగుణంగా పోషకాలు అధికంగా ఉంటాయన్నారు. రిఫైన్డ్ చక్కెర,వేయించిన ఆహారాలకు దూరంగా ఉండాలన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం దొండపర్తిలో కొలువుదీరిన గణనాథుని నిమజ్జనోత్సవానికి మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ ఇంఛార్జ్ వాసుపల్లి గణేష్ కుమార్ రూ.10 వేలు విరాళం అందజేశారు. వైసిపి 27 వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులకు రూ.10వేలు నగదును ఆశీలమెట్ట కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లిని వారు అభినందించారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT BOBBILI
H.M.O.P. 28/2025
Between:
Koripalli Seshagiri ...Petitioner
And
Koripallli [Datti] Neelima ...Respondent
NOTICE
To, **The Respondent**:
Smt Koripilli [Datti] Neelima, W/o. Koripalli Seshagiri, R/at Flat No.203, Springing View Apartment, Midilapuri VUDA Colony, 100 feet Road, Madhurawada, Visakhapatnam-530048.
Please take notice that the above named petitioner has instituted the above case against you and the matter stands posted to **25-09-2025** for your appearance on that day **10:30 A.M.**, you should appear before the aforesaid Hon'ble court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
K. SUDHARANI, Advocate
Bobbili, Visakhapatnam
Cell: 9494374886.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL DISTRICT JUDGE OF HOSUR
O.S. No. 43/2014
PLAINTIFF : K.V. Rangasamy, aged about 55 Years, S/o. Late. Krishnappa, residing at Door No. C-36, TNHB, Rayakotta Road, Hosur-635109.
-//Vs//-
DEFENDANT : Defendant No.21: SridharNambala, S/o.Nambala Krishnamoorthy, Residing at No.92-11, Karasa Police Quarters, N.A.D. Kotha Road, Visakhapatnam-530009
NOTICE
The above Plaintiffs filed a suit for partition and separate possession and permanent injunction and other reliefs against the defendants. The suit is posted **on 24-10-2025** for appearance of defendant no.21 namely Sridhar Nambala, hereby directed to appear in person or through pleader on **24-10-2025 at 10.30 A.M.** before the above said court failing which the above suit will be decided exparte in your absence.
// BY COURT ORDER //
N.MANJUNATH, B.A.L., LL.B., Advocate Hosur.
M.S.No.206 (A) /2008
 # 1, Venus Arcade, 1st Floor Telephone Exchange Road, Near Court Campus, HOSUR-635109
Cell: 97904 66837

DOCUMENT MISSING
I DONKANI SRINU
S/o. D.Govida
SHIVASAKTINAGAR
KOMMADI JN
MADHURAWADA
VISAKHAPATNAM
I lost my original CDC No. MUM513045
In Madhurawada
Date: 4/9/2025
Anybody found please inform
Cont. 6302586944

మహారాజశ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.64/2006 E.P.49/2019
వాది / పిటిషనరు / డి.హెచ్.ఆర్.:
దొడ్డి సత్యనారాయణ (Died) మరి ఇద్దరు
ప్రతివాదులు / రెస్పాన్డెంటు / జె.డి.ఆరు:
మంజు చిట్స్ & ఫైనాన్స్ కంపెనీ, నర్సీపట్నం రిప్రెసెంటెడ్ బై ఇట్స్ పార్టనర్ యర్రంశెట్టి వెంకట రమణమ్మ మరి ముగ్గురు.
సి.పి.సి. ఆర్డరు 21 రూలు 64 ప్రకారము ప్రతివాదులు / రెస్పాన్డెంట్లు /జె.డి.ఆర్డరులకు నోటీసుల ప్రకటన
1వ ప్రతివాది/ జె.డి.ఆర్:
మంజు చిట్స్ & ఫైనాన్స్ కంపెనీ, నర్సీపట్నం రిప్రెసెంటెడ్ బై ఇట్స్ పార్టనర్ యర్రంశెట్టి వెంకట రమణమ్మ, భర్త లేటు నారాయణరావు సా॥ ఇంటి నెం.10-6-20/8, 1వ ఫ్లోర్, సాయిబాబా టెంపుల్ మార్కెట్ వీధి ఎదురుగా రాంనగర్, విశాఖపట్నం.
2వ ప్రతివాది/ జె.డి.ఆర్:
యర్రంశెట్టి వెంకట రమణమ్మ, భర్త లేటు నారాయణరావు, సా॥ఇంటి నెం.10-6-20/8, 1వ ఫ్లోర్ సాయిబాబా టెంపుల్ మార్కెట్ వీధి ఎదురుగా, రాంనగర్, విశాఖపట్నం.
3వ ప్రతివాది/ జె.డి.ఆర్:
యర్రంశెట్టి వెంకట సత్య మంజుల, భర్త లేటు నారాయణరావు, సా॥ఇంటి నెం.10-6-20/8, 1వ ఫ్లోర్ సాయిబాబా టెంపుల్ మార్కెట్ వీధి ఎదురుగా, రాంనగర్, విశాఖపట్నం.
4వ ప్రతివాది/జె.డి.ఆర్:
యర్రంశెట్టి శ్రీనివాస కార్తీక్, భర్త లేటు నారాయణరావు, సా॥ ఇంటి నెం.10-6-20/8, 1వ ఫ్లోర్ సాయిబాబా టెంపుల్ మార్కెట్ వీధి ఎదురుగా, రాంనగర్, విశాఖపట్నం.
పై నెంబరు పిటిషన్‌లో వాదులు/ డిహెచ్‌ఆర్‌లు అమలు భాకీ రాబట్టుకొనెందుకు దాఖలు చేసిన పై నెంబరు అమలు షెడ్యూల్ దాఖలా ఆస్తిని వేలం వేయమని కోరినందున మీకు అభ్యంతరములు ఉన్న **యెడల తేది.16-09-2025న** కోర్టుకు హాజరై శ్రీ కోర్టు వారికి మీ అభ్యర్ధనములు, ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల మీకు ఎట్టి ఆక్షేపణలు లేవని ఎంచి మీ పరోక్షములో శ్రీకోర్టు వారు తమ ముందున్న దస్తావేజుల ఆధారముగా తీర్పు చెప్పదరు.
వాయిదా తేది: 16-09-2025
మెట్ట ప్రభాకర్
న్యాయవాది, నర్సీపట్నం.
సెల్ : 8179154586, 7989015974.
నర్సీపట్నం
తే:14-09-25

గ్రీన్ బెల్ట్‌లో ఆక్రమణలు

- బడ్డీలతో వ్యాపారం చేసి జేబులు నింపుకుంటున్న చోటా నాయకులు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : నిత్యం రద్దీగా ఉండే జాతీయరహదారిని కూడా ఆక్రమణదారులు వదలటం లేదు. జాతీయరహదారిని ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించుకొని బడ్డీలు ఏర్పాటుచేసి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు పేరు చెప్పుకొని బడ్డీలు ఏర్పాటుచేసుకొని రూ.లక్షల్లో అమ్మేసుకుంటున్నారు. కొంతమంది బడ్డీలను అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా తమ కళ్ల ముందే జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తూ పరోక్షంగా సహకరిస్తున్నారు. జాతీయరహదారి పాతడెయిరీఫారం నుంచి జూ పార్కు వైపు వెళ్లే రహదారిని ఆనుకొని భవిష్యత్ అవసరాలు, పచ్చదనం కోసం ఉంచిన ఖాళీ స్థలాలను దర్జాగా ఆక్రమించుకొని, బడ్డీలు, రేకుల షెడ్లులు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకొని స్థానికంగా ఉన్న నాయకులు బడ్డీలు ఏర్పాటు చేసి రూ.లక్షల్లో అమ్మేసుకుంటున్నారు. కొంతమంది బడ్డీలు ఏర్పాటుచేసి చిన్న చిన్న వ్యాపారస్తులకు అద్దెకు ఇచ్చి నెలకు సుమారు రూ.5 వేల నుంచి రూ.6 వేలు వసూలు చేసుకుంటున్నారు. మరికొంత మంది దౌర్జన్యంగా గెడ్డలను కప్పేసి, గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించుకొని రేకుల షెడ్లులు నిర్మించి వ్యాపారాలు సాగిస్తున్నారు. జాతీయరహదారి పొడవునా పదుల సంఖ్యలో అక్రమంగా బడ్డీల వ్యాపారం సాగుతుంది. ఇదే ప్రాంతంలో ఒక వ్యక్తి ఏర్పాటు చేసిన టీ స్టాల్‌కు విద్యుత్ శాఖ అధికారికంగా విద్యుత్ మీటరు కూడా ఇచ్చేసింది. జాతీయరహదారిని ఆక్రమించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి. పాత డెయిరీఫారం కూడలి నుంచి ఆదర్శనగర్ వైపు వెళ్లే రహదారిలో వందల కొలది బడ్డీలు వెలిశాయి. ఇక్కడ రోడ్డు విస్తరించినా బడ్డీల ఆక్రమణలతో ప్రయోజనం లేకుండా పోయింది. ఇంత జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణలు తొలగించలేక పోతున్నారు. అంటే రాజకీయ నాయకుల ఒత్తిడి ఎంతవరకు ఉందో అర్థమౌతుంది. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు దీనిపై దృష్టిసారించి ఆక్రమణలు తొలగించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జాతీయరహదారిని ఆనుకొని వెలసిన బడ్డీలు

ఉపాధ్యాయులు ప్రసాదరావును సన్మానిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయులు టిఎస్‌వి.ప్రసాదరావును ఆదివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. జాతీయ హిందీ భాషా దినోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసి చైర్మన్ బి.సోమేశ్వరరావు, సభ్యులు మురళి, రాజు తదితరులు పాల్గొన్నారు. హిందీ భాష అభివృద్ధికి ప్రసాదరావు చేస్తున్న కృషిని కొనియాడారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పలువురు సూచించారు. జివిఎంసి మూడో వార్డు పరిధిలో యువ భారత్ ఆధ్వర్యంలో వివేకానంద రీడింగ్ రూమ్ తృతీయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'గ్రంథాలయాలు, వాటి ఆవశ్యకత' అంశంపై 6,7,8 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు, ఈ కార్యక్రమంలో రీడింగ్ రూమ్ నిర్వాహకులు ఎస్.జోగారావు, కె.రమణ, ఎ.హేమంత్‌శేఖర్, లైబ్రేరియన్ రమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామపంచాయతీ బర్లపేట గ్రామంలో 90 నిరుపేద కుటుంబాలకు విశాఖపట్నానికి చెందిన రోటరీ క్లబ్ అధ్యక్షులు రాంప్రసాద్, సభ్యులు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీచేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి కేంద్రకారాగారం ఎదురుగా గల రామకృష్ణాపురంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గ్రామ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యాన జెడిఎస్ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ఎస్‌ఎస్‌ఎన్.నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య తనిఖీలు చేయించుకున్నారు. వైద్యుల పర్యవేక్షణలో 110 మందికి బిపి, మధుమేహం తదితర పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో జెడిఎస్ డిఎంఒ డాక్టర్ లాలు సంతోష్, మార్కెటింగ్ మేనేజర్ ఎ.అనిల్, జి.రేవతి, సాయి, ఆర్‌జి.నాయుడు, రామకృష్ణాపురం గ్రామ సంఘం అధ్యక్షులు వంకర బాబూరావు, కాకర గోవిందు, నల్ల సింహాచలం, చీకటి నాగేశ్వరరావు, మండల శ్రీరామ్, మదపాక ముత్యాల దేవుడు, గాడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

50 మందికి నేత్ర వైద్య పరీక్షలు

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 50 మంది కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. మధురవాడకు చెందిన నియో విజన్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈవైద్య శిబిరంలో సర్పంచ్ చెల్లూరి పైడపుడు, ఎంపిటిసి సభ్యులు చెల్లూరి నగేష్ బాబు, గ్రామీణ వైద్యుల సంఘం ఉత్తరాంధ్ర జోనల్ ప్రధాన కార్యదర్శి గెద్ద చిరంజీవి, సంతోష్, ఆదిబాబు, ఆసుపత్రి సిబ్బంది సాయి కుమార్, లోకేష్ పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆర్ఒ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామపంచాయతీ బర్లపేట గ్రామంలో రూ.6 లక్షలతో నిర్మించిన ఆర్ఒ ప్లాంట్‌ను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ ప్లాంట్‌ను విశాఖపట్నానికి చెందిన రోటరీ క్లబ్ అధ్యక్షులు రాంప్రసాద్ ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేశారు. గ్రామంలో సుమారు 50 మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు రెండు నెలల క్రితం వచ్చిన వార్తలను చూసి రాంప్రసాద్ స్పందించి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు తాగునీరు అందించేందుకు ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు రెండు నెలల పూర్తి కాకముందే ఏర్పాటుచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ, ఈ ఆర్ఒ ప్లాంట్‌ను సక్రమంగా నడిపించుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.రామస్వామినాయుడు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కె.లీలావతి, టిడిపి మండల అధ్యక్షులు కె.రమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు, టిడిపి మహిళా అధ్యక్షులు బి.పావని ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దుర్గాదేవి రాట మహోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్ దుర్గాదేవి చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన దుర్గాదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం పందిరిరాట కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, ఎమ్మెల్యే కుమారుడు వెలగపూడి ప్రతాపరుద్ర పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు, వడిశెల శ్రీను మాట్లాడుతూ, ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంటరీ సెక్రటరీ ఏడువాక సన్యాసిరావు, వార్డు అధ్యక్షులు పాత్రకండ ధర్మారావు, మహిళా అధ్యక్షులు మజ్జి రమణి, కార్యదర్శి యల్లమిల్లి సురేష్, క్లస్టర్ ఇన్‌చార్జి తురకపూడి బాలస్వామి, పి.ఐ.బాలరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ముఖ్యఅతిథులు

ప్రజాశక్తి - ఆరిలోవ : మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల్లో భాగంగా ముస్తాఫా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆరిలోవ, డ్రైవర్స్ కాలనీలో ముస్లిం సంక్షేమ సామాజిక భవనంలో ఆదివారం ముస్లిం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.నజీర్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాపరుద్ర, మస్తాన్ జ్యూయలర్స్ అధినేత అహ్మద్ ముఖ్యఅతిథులుగా పాల్గొని సుమారు 250 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ రేఖా జ్యోతి, 11వ వార్డు టిడిపి ఇన్‌చార్జ్ రాగతి అచ్యుతరావు, అధ్యక్షులు ముగడ రాజారావు, గాడి సత్యం, అసోసియేషన్ పెద్దలు ఎస్‌కె.ఖలేషా, అక్బర్ ఆలీ, మొహిద్దీన్, ఎస్‌కె.ఫిరోజ్‌బాబు, షామర్, జానీ, కమల్ భాషా, ఎస్‌కె.మదీన తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిని దత్తత తీసుకున్న శ్రీ మహాలక్ష్మి అసోసియేషన్

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం మండలం, నేలతేరు కెజిబివి పాఠశాలను శ్రీ మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ దత్తత తీసుకుంది. ఈ సందర్భంగా దిబ్బడపాలెం గ్రామంలోని అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి యువ నాయకులు గంటా రవితేజ హాజరై మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే దృఢ సంకల్పంతో శ్రద్ధగా నేర్చుకుంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని పేర్కొన్నారు. పాఠశాలకు పేరెంట్స్ వెయిటింగ్ హాల్ భవనం, ల్యాప్‌టాప్‌లు, పలు పరికరాలను అందించినందుకు అసోసియేషన్ సేవలను రవితేజ ప్రశంసించారు. ఉపాధ్యాయులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు.

అసోసియేషన్ అధ్యక్షులు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, పేద విద్యార్థులకు అండగా ఉంటామని, అవసరమైన వనరులు కల్పించి, వారిని భావి పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే పాఠశాలకు అనేక సహాయ సహకారాలు అందించామని, మున్ముందు మరిన్ని సేవలు అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.లావణ్య, ఎపిసి జె.చంద్రశేఖర్, చైర్మన్ శివాజీ, వైస్ చైర్మన్ మంగపున్న, అసోసియేషన్ సభ్యులు, మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకరరావు, కార్యదర్శి అర్జునరావు, క్లబ్ ఫౌండర్ గొర్లె ప్రసాద్, పి.రామకృష్ణారావు, మెంబర్స్ శ్రీనివాసరావు, పురుషోత్తం, భగవాన్, వెంకట్ రాజు, గజేంద్ర వర్మ, అర్జున్ కుమార్, కుమార్ స్వామి, సర్పంచ్ బిఆర్‌బి నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అతిథులు

మిద్దె తోటల నగరంగా విశాఖ

ప్రజాశక్తి-సీతమ్మధార : మిద్దె తోటల నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని ద్వారకానగర్ వనమాలి, సిటిజి మిద్దె తోటల రైతులు నిర్ణయం తీసుకున్నారు. ద్వారకానగర్‌లోని సుగుణవల్లి మిద్దె తోటలో ఆదివారం వారంతా సమావేశం అయ్యారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో అందజేసిన దేశీయ నల్లని, తెల్లని వంగ, గుంటూరు పచ్చిమిర్చి, టమాటా, బంతి నారు మొక్కలు పంపిణీ చేశారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, కోరమండల్ ఫెర్టిలైజర్స్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవోలు అందజేసిన గుడ్డ సంచులను అందరూ పంచుకుని వస్త్ర సంచులు వినియోగిద్దాం అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఇన్‌చార్జులు లావణ్య, మహాలక్ష్మి పాల్గొన్నారు.

దళిత బహుజనులు ఏకం కావాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : అనేక వర్గాలుగా విభజించబడిన దళిత బహుజనుల ఏకం కావాలని యుపిఎస్‌సి పూర్వ సభ్యుడు, ద్రావిడ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెఎస్.చలం పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం భీమ్ సేన వార్ ఆధ్వర్యంలో మహా సదస్సును నిర్వహించారు. ముందుగా బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'బహుజనులారా మీరు ఎటువైపు?' అనే అంశంపై కెఎస్.చలం మాట్లాడారు. దళిత, బహుజనలంతా అనేక పార్టీల కింద విభజించబడి ఉన్నారని, వారంతా ఏకమై హక్కుల సాధన, రాజ్యాధికారం దిశగా పయనించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్,పెరియర్ రామస్వామి కలిసి దేశమంతా తిరిగి ఉద్యమాన్ని నిర్మించారని చెప్పారు. రిజర్వేషన్లు తొలిసారి తమిళనాడులో అమల్లోకి వచ్చాయని వాటికి ఆటంకం ఏర్పడితే 1951లో తొలి రాజ్యాంగ సవరణ జరిగిందని చెప్పారు. భారతదేశం బౌద్ధ దేశమని పూర్వమే అయోతీదాస్ చెప్పారని తెలిపారు. కేరళ రాష్ట్రంలో దళితుల ఆలయ ప్రవేశం కోసం నారాయణ గురు ఎంతో పెద్ద పోరాటాన్ని చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీసీలుగా ఉన్న అనేక కులాలు ఇతర రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీలుగా ఉన్నారని వివరించారు. వారందరి మధ్య ఐక్యత కావాలన్నారు. అనేక ఉద్యమాల ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో 12 లక్షల ఎకరాలు భూములు దళిత, బహుజనులకు పంచగా ఆ భూములు తిరిగి అధిపత్య కులాల వారు అన్యాక్రాంతం చేశారన్నారు. సిక్కోలు బుక్ ట్రస్ట్ సంపాదకుడు దుప్పల రవికుమార్

మహా సదస్సుకు హాజరైన ప్రతినిధులు

అస్తిత్వ స్పృహ అనే అంశంపై మాట్లాడుతూ భారతదేశానికి ఆర్యులు రాకముందే ఎంతో అభివృద్ధికర దేశంగా సింధు ప్రాంత మూల వాసులు అభివృద్ధి చేశారన్నారు. భారతదేశం 6300 కులాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీలను చీల్చివేసి వారి మధ్య ఐక్యత లేకుండా విష సంస్కృతిని సష్టించారని పేర్కొన్నారు. సింధు నాగరికతకు మూలమైన దళిత బహుజనుల చరిత్రతో పాటు బౌద్ధ చరిత్రను కూడా ఆర్యులు తగలబెట్టారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే కుల, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు ముందుకు వచ్చాయని పేర్కొన్నారు. భీమ్ సేన వార్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని మార్చి వేసే కుట్ర సాగుతోందని, రాజ్యాంగం దేశ ప్రజలకు రక్షణ కవచం అని, దాన్ని రక్షించుకోవాలని పేర్కొన్నారు. అధ్యక్షుడు కె.చిన్నారావు మాట్లాడుతూ, మనువాదుల పాలనలో ప్రజల మధ్య అంతరాల మరింత పెరుగుతున్నాయని, రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తూ ప్రైవేటీకరణ జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సులో పలు తీర్మానాలను ఆమోదించారు. చంద్రబాబు ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. ఇటీవల కైకలూరు దళితులపై ఆధిపత్య కులాల వారు జరిపిన దాడిలో నేరస్తులను తక్షణమే అరెస్టు చేయాలని మరో తీర్మానాన్ని సదస్సు ఆమోదించింది. ఈ కార్యక్రమంలో భీమ్ సేన వార్ నాయకులు బల్లంకి కనకరాజు, మధు కుంచే, జి.రవికుమార్, కొల్లాబత్తుల ప్రసాదరావు, బీర రత్నకుమారి, ఎన్.రేణుకుమార్, కృష్ణకుమారి, దత్తు రవి, శంకర్ మహంకాళి, వెంకట నరసయ్యలతో పాటు పలు సంఘాల నాయకులు జెవి.ప్రభాకర్, అంబేద్కర్, మాటూరు శ్రీనివాసరావు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవంలో ఏర్పాటుచేసిన ప్రదర్శనలు

ముగిసిన బాలోత్సవం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించిన బాలోత్సవం ఆదివారంతో ముగిసింది. బాలోత్సవం 2వ రోజు కూడా సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్‌కు 23 రకాల అకడమిక్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సైన్స్ ఎగ్జిబిషన్, స్పెల్ బి ఇంగ్లీషు, ఇండియా, ప్రపంచ మ్యాపింగ్, ఉపన్యాసం తెలుగు, ఇంగ్లీష్, క్విజ్, తెలుగులో మాట్లాడటం, మెమరీ టెస్ట్, పద్యం భావం, మట్టితో బొమ్మలు, అకడమిక్ ఈవెంట్స్ పోటీ అంశాలుగా ఉన్నాయి. సైన్స్ అండ్ టెక్నాలజీ లేకపోతే మన జీవితం ఎలా ఉండేది?, దేశానికి రైతు వెన్నెముక, విద్యార్థులు... ఆత్మహత్యలు, నిన్ను నడిపిస్తున్నది సైన్సా, విశ్వాసాలా, మట్టితో బొమ్మలు ధీంగా సైన్స్ అండ్ టెక్నాలజీ రాకెట్ ఉపగ్రహం రోబోట్, టాపిక్, ఇష్టమైన ఆట వస్తువు సమకాలీన అంశాలు ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యం, దేశభక్తి, అభ్యుదయ గీతాలాపన, శాస్త్రీయ నృత్యం, ఫ్యాన్సీ డ్రెస్, కోలాటం, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ నిర్వహించారు. ఎన్ఎడి నుంచి పెందుర్తి వరకు ఉన్న 40 పాఠశాలలు నుండి సుమారు 1500 మంది విద్యార్థులు ఈ బాలోత్సవంలో పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో ముఖ్య అతిథిగా పెందుర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, తల్లిదండ్రులు పిల్లలను తీర్చిదిద్దాల్సిన రీతి గురించి వివరించడమే గాక పిల్లలు ఈ రోజు మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, దానివలన జరిగే అనర్థాల గురించి వివరించారు. కల్యాణి చేతులమీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రఖ్యాత ఇంజినీర్, భారత రత్న శ్రీమోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం సందర్భంగా ఆయన విగ్రహానికి కల్యాణి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, రాజేశ్వరరావు, పి.రఘు, సెక్రటరీ చంద్రశేఖర్, వి.నరసింగరావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. రెండురోజులు పాటు ఎంతో కోలాహలంగా జరిగిన ఈ బాలోత్సవానికి సహకరించిన అందరికీ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

పట్టాలకు రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి -ములగాడ : ప్రభుత్వ స్థలాలకు 2016లో క్రమబద్ధీకరణ పట్టాలు పొందిన 5172 లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు నిర్వహించనున్నామని కూటమి కో-ఆర్డినేటర్ విశ్వనాధుల దినకర్ తెలిపారు. ప్రభుత్వ విప్ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆదేశాలతో 59వ వార్డు పరిధి హిమాచల్ నగర్ సచాలయంలో ఆదివారం రిజిస్ట్రేషన్లకు సంబంధించి లబ్ధిదారులు ఫొటో, ఆధార్‌కా ర్డు, ఇద్దరు సాక్షులు, వారి ఆధార్ కార్డులు తీసుకుని వస్తే నివాసముంటున్న స్థలాన్ని లబ్ధిదారుడి పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే డాక్యుమెంట్‌తో పాటు పట్టా అందజేస్తామని చెప్పారు. పట్టా రిజిస్ట్రేషన్ సమయంలో మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా అధికారుల పర్యవేక్షణలోనే జరుగుతుందని వివరించారు. జిఒ 30 ప్రకారం అభ్యంతరాలు లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ అయిన వారికి తహశీల్దార్ రమేష్ నాయుడు, ప్రభుత్వ విప్ గణబాబు చేతుల మీదగా రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కార్యక్రమంలో విఆర్ఒలు శివశంకర్, రవితేజ, టిడిపి నాయకులు పొట్టి మూర్తి, రామారావు, ఉరుకుటి మహేష్ యాదవ్, దామోదర్, శివ పాల్గొన్నారు.

పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో విశ్వనాధుల దినకర్ తదితరులు

సన్యాసిరావు అమరజీవి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

వర్ధంతి సభలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : ప్రజానాట్య మండల కళాకారుడు కీర్తిశేషులు జి.సన్యాసిరావు అమరజీవి అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్యాసిరావు ప్రథమ వర్ధంతిని గాజువాక లయన్స్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. సన్యాసిరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, సన్యాసిరావు అందరివాడు అన్నారు. ఆయన జనం హృదయాల్లో నిలిచిపోయే పాటలు పాడారని తెలిపారు. రైతు కష్టాలు, కార్మికుల వేతనాలు, ఆర్థిక ఇబ్బందులు, నిరుద్యోగులు, పెరిగిన ధరలు, మంచినీటి సమస్యలపై పాడిన పాటలు నేటికీ మర్చిపోలేనివని పేర్కొన్నారు. ఏదైనా లక్ష్య సాధన కోసం పని చేస్తే అంగవైకల్యం అడ్డు రాదని నిరూపించిన వ్యక్తి సన్యాసిరావు అని కొనియాడారు. దేశంలో ఉన్న సంపదపై ప్రజలకు హక్కు ఉండాలన్నారు. కానీ కొద్ది మంది చేతుల్లోనే సంపద ఉందని, అలా కాకుండా ప్రజలందరికీ చెందాలి అన్నదే సిపిఎం లక్ష్యమని, ఆ లక్ష్య సాధన కోసం చివరి వరకు సన్యాసిరావు పాటుపడ్డారని తెలిపారు. దోపిడీ లేని సమాజం, విద్య, వైద్యం ప్రజలకు దక్కాలనే ఉద్దేశంతో సిపిఎం పనిచేస్తుందన్నారు. సైన్స్ అభివృద్ధికి ఆయన శరీరాన్ని దానం చేసినట్లు తెలిపారు.

ప్రజానాట్యమండలి రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎస్‌జిఎం.భాష మాట్లాడుతూ, సన్యాసిరావు ఎన్నో పాటలు పాడి కార్మికులను ఉత్తేజపరిచారన్నారు. ప్రతి పోరాటంలోనూ, ఉద్యమంలోనూ ఆయన పాత్ర ఉందన్నారు. చాలామందికి స్ఫూర్తిని నింపారన్నారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, పాయకరావుపేట నియోజకవర్గం మూసిపేటలో తమలపాకు రైతులు సమస్యలపైన అనేక పాటలు పాడారని గుర్తు చేశారు. ఒకపక్క ఉద్యోగం చేస్తూ, మరోపక్క రైతులు, ప్రజలు, కార్మిక సమస్యలపై పనిచేసారని తెలిపారు. ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు కె.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా కార్యదర్శి చంటి, గుర్రం రమణ, ఎం.నాగేశ్వరరావు, భార్య జిఎన్‌ఆర్ లక్ష్మి, కుమారుడు స్టాలిన్, కుటుంబ సభ్యులు ఎన్.చైతన్య, ఎన్.కృష్ణ, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు వైటి.దాస్ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలకు ఎమ్మెల్యే సత్కారం

ప్రజాశక్తి -గాజువాక : ప్రభుత్వ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీని బలోపేతం చేయడంలో కార్యకర్తల కృషి వెలకట్టలేనిదని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జివిఎంసి 65వ వార్డులో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేసిన వార్డు కార్యకర్తలను పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు రట్టి వాసు, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యకర్తలను సత్కరించి అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు తొలి అడుగు కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలు, వారి ఇబ్బందులు, ప్రభుత్వ సేవల సద్వినియోగం తదితర అంశాలపై ప్రజలతో మమేకమైన తీరు చాలా గొప్పది అని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో మరింతగా కష్టపడి ప్రభుత్వానికి, పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, డైరెక్టర్ అంగ కృష్ణ, పార్టీ నాయకులు, మహిళా నేతలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి- సీతమ్మధార : విద్యార్థి అభివృద్ధిలో ఉపాధ్యాయులది అత్యంత ముఖ్య పాత్ర అని నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్ దాస్ అన్నారు. బాల వికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ లంకపల్లి బుల్లయ కళాశాలలోని గాంధీ సెంటర్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు 2024 -25 ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య ఎస్.రామకృష్ణారావు, సిక్కిం మాజీ డిజిపి అత్తిలి సుధాకర్, బివిఎఫ్.ఫౌండర్ నరవ ప్రకాష్ రావులతో కలిసి మహాత్మా గాంధీ విగ్రహానికి వి.బాలమోహన్‌దాస్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడుతూ, మంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ద్వారానే విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని పేర్కొన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయుల బోధన ఉండాలన్నారు. ఆచార్య రామకృష్ణారావు మాట్లాడుతూ, ప్రాథమిక విద్య నుంచే క్రమశిక్షణ, అంకితభావం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కకూ వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. సిక్కిం మాజీ డిజిపి అత్తిలి సుధాకర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదన్నారు. జీవితంలో రాణించాలంటే సరైన మార్గదర్శకం అవసరం అన్నారు. బాల వికాస్ ఫౌండేషన్ ఫౌండర్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, జాతీయ, రాష్ట్రస్థాయిలో విశాఖపట్నానికి చెందిన ఉపాధ్యాయులు అవార్డులు పొందడం మనందరికీ గర్వకారణం అన్నారు. అనంతరం జాతీయ అవార్డు

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారిని సత్కరిస్తున్న బాలమోహన్‌దాస్ తదితరులు

పొందిన ఉపాధ్యాయిని తిరుమలశ్రీదేవి, రాష్ట్రస్థాయిలో అవార్డులు పొందిన జి.కుమారస్వామి, జిఎం.సుజాత, ఎం.మోహన్‌రావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రచయిత ఆర్.శివకుమార్, బ్రహ్మకుమారీల ప్రతినిధి కామేశ్వరి, బివిఎఫ్ కన్వీనర్ డాక్టర్ జ్ఞానేశ్వర్ బాబ్జి, అధ్యాపకులు, ఎన్జీవోలు, మేధావులు పాల్గొన్నారు.

మెగా అర్బన్ లేఅవుట్‌లో ఖాళీ స్థలాలు కబ్జా

పట్టించుకోని రెవెన్యూ, విఎంఆర్‌డిఎ అధికారులు

ఎరుకునాయుడుపాలెం రెవెన్యూ పరిధి 73, 75 సర్వేనెంబర్లలోని పైడివాడ అగ్రహారం అర్బన్ లేఅవుట్‌లో ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసిన దృశ్యం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం విఎంఆర్‌డిఎ అర్బన్ మెగా లేఔట్‌లో సామాజిక అవసరాల కోసం కేటాయించిన ఖాళీ స్థలాలను కొంతమంది కబ్జా చేస్తున్నారు. ఈ స్థలాలను చదును చేసి ప్లాట్లుగా విభజించి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. అయినా కూడా రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నిరెత్తినట్లు వివరించడంపై అర్బన్ హౌసింగ్ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత వైసిపి ప్రభుత్వం జగనన్న మెగా అర్బన్ హౌసింగ్ లేఔట్‌గా 2021లో ఏర్పాటు చేసింది. దీని కోసం నాటి ప్రభుత్వం పైడివాడ, పైడివాడ అగ్రహారం, ఎరుకునాయుడుపాలెం రెవెన్యూ పరిధిలో సుమారు 328 ఎకరాల భూమిని సేకరించింది. ఇందులో 233 ఎకరాలలో సుమారు పదివేల ప్లాట్లు ఒక సెంటు భూమి చొప్పున బ్లాకులుగా విభజించి అర్బన్‌కు చెందిన పేదలకు ఇల్లు స్థలాలు మంజూరు చేసింది. ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన రైతులకు 87.83 ఎకరాలను అభివృద్ధి చేసిన ప్లాట్లుకు కేటాయించారు. ఈ లేఔట్‌ల్లో పార్కులు, ఆట స్థలం, తాగునీటి ట్యాంకులు, సామాజిక మరుగుదొడ్లు, స్కూల్, దేవాలయం వంటి ఎమినిటీస్, సామాజిక అవసరాల కోసం సుమారు 30 ఎకరాల 43 సెంట్లు కేటాయించారు. కాగా ఎరుకునాయుడు పాలెం రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 73, 75ల్లో జగనన్న లేఅవుట్‌లో సామాజిక అవసరాలకు కోసం కేటాయించిన స్థలంలో సుమారు 97 సెంట్లును కబ్జా చేశారు. దీనిపై రెవిన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై గ్రామస్తులు, లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఈ విషయమై ఎరుకునాయుడు పాలెం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ మొల్లి సింహాచల నవనీత్ వర్మ (చిన్నారావు) గతంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు, విఎంఆర్‌డిఎ కమిషనర్, చైర్మన్‌లకు ఫిర్యాదు చేశారు. స్థానిక తహసీల్దార్ పార్కు స్థలాలను తూతూ మంత్రంగా పరిశీలించి గాలికి వదిలేశారు. దీనితో కబ్జాదారులు ఈ భూములను ఇళ్ల స్థలాలుగా విభజించి పెన్సింగ్ వేసి, గేట్లు ఏర్పాటు చేసి విక్రయించడానికి సిద్ధంగా ఉంచారు. ఇప్పటికైనా రెవెన్యూ, విఎంఆర్‌డిఎ అధికారులు స్పందించి సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలను రక్షించాలని అర్బన్ హౌసింగ్ లే అవుట్ లబ్ధిదారులు, పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

చెట్లు పెంచి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచడం ద్వారా పచ్చదనాన్ని పర్యావరణాన్ని కాపాడవచ్చని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఎపి జీవ వైవిధ్య సంరక్షణ అవార్డు గ్రహీత, గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ అన్నారు. మండలంలోని పిసినికాడ పంచాయతీ బిఆర్‌టీ కాలనీలో గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. స్థానికులు చేత పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. వేప, బాదం, పనస, రావి, మామిడి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మొల్లేటి శివాజీ, సర్పంచు ఎల్లపు రమేష్, మాజీ ఎంపీటీసీ మల్లా శ్రీను, స్థానిక పెద్దలు ఎల్లపు వెంకట్రావు, దొడ్డి సూరిబాబు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కాండ్రేగుల సత్యనారాయణ తదిరతులు పాల్గొన్నారు.

ఆయుర్వేద మందులతో ఆరోగ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆయుర్వేద మందులతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రముఖ ఆయుష్ వైద్యులు డాక్టర కె.లావణ్య అన్నారు. స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్‌లో ఆదివారం వాకర్స్ క్లబ్ సెప్టెంబర్ నెల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ లావణ్య మాట్లాడారు. తిప్పతీగ, ఉసిరి, నేరేడు, వేప వంటి చెట్ల ఉపయోగాలు తెలియజేశారు. శిలాజిత్, వసంత కుసుమాకరం, పసుపు, ధనియాలు, జీలకర్ర పదార్థాలను ఎలా వాడాలో, ఏ మోతాదులో వాడాలో వివరించారు. శొంఠి పొడి, నెయ్యి విరివిగా వాడటం వలన ప్రయోజనం ఉంటుందని తెలిపారు. అనంతరం డాక్టర్ లావణ్యను వాకర్స్ అధ్యక్షులు రాపేటి నారాయణ రావు, కోశాధికారి కేవివి సత్యనారాయణ, కెవి గౌరీపతి, యల్లపు సత్యనారాయణ, దాడి స్వామి నాయుడు, ఎన్ దేవుళ్ళు ఘనంగా సత్కరించారు.

ఎంపిపి జయలక్ష్మి అసత్య ప్రకటనలు మానుకోవాలి

ప్రజాశక్తి-మునగపాక : ఎంపీపీ మల్ల జయలక్ష్మి అసత్య ప్రకటనలు మానుకోవాలని జనసేన పార్టీ మండల నాయకులు ఏవి సత్యనారాయణ, ఎల్లపు వెంకట భాస్కరరావు హితవుపలికారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే ఆమె జనసేన పార్టీలో చేరారని గుర్తు చేశారు. ఎంపీపీ తన సొంత లాభం కోసమే జనసేన పార్టీలో చేరారని, ఇప్పుడు ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని హితవుపలికారు. సమావేశంలో అల్లవరపు రమణబాబు, వేగి కృష్ణ, ఎల్లపు సంతోష్ కుమార్, కాండ్రేగుల పరదేశి రావు, సాయి పాల్గొన్నారు.

నేటి నుండి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి మండలంలో పశు వైద్య కేంద్రాల్లో ఈ నెల 15 నుండి అక్టోబరు 15వ తేదీ వరకు పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందని మండల పశువైద్యాధికారి డాక్టర్ సిహెచ్.అనీల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15,700 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందని చెప్పారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనుల్లో నాణ్యతా లోపం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్చుతాపురంలో నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులలో నాణ్యతా ప్రమాణాలు లోపించాయని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆరోపించారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులు చేసే సమయంలో ఇంజనీరింగ్ అధికారులు ఎక్కడా కనిపించడం లేదన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న రహదారి పనులపై పర్యవేక్షణ కొరవడిందని ఆరోపించారు.

జాగృతి సభ్యులకు ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక జాగృతి సంస్థ సభ్యుడైన పచ్చికూరవానిపాలెం గ్రామానికి చెందిన కండిపల్లి పైడికొండ తండ్రి కొండ ఇటీవల అకస్మాత్తుగా మరణించగా ఆయన నామినీ అయిన భార్య కండిపల్లి వరలక్ష్మికి జాగృతి సంస్థ ద్వారా లక్ష రూపాయిలు బీమా చెక్కును జాగృతి గ్రామ ప్రతినిధి వడ్డాది కనకం చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత పాల్గొన్నారు.

నూర్‌బాషా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం చింతలపాలెం మసీద్ వద్ద ఆదివారం నియోజకవర్గం నూర్‌బాషా కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ గౌరవ అధ్యక్షులుగా షేక్ బాబార్, అధ్యక్షులుగా షేక్ బాబ్జి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ బాబూరావు, ఉపాధ్యక్షులుగా షేక్ మదీనా, సుభాని, కార్యదర్శిగా షేక్ సుభాని, సహాయ కార్యదర్శిగా షేక్ రెహమాన్, కోశాధికారిగా షేక్ ఇమామ్, మరో ఐదుగురు సభ్యులు ఎన్నికయ్యారు.

తెగిన వారధి.. తాటి దుంగలే దారి

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం విజయ రామరాజుపేట- వడ్డాది గ్రామాల మధ్య బిఎన్ రోడ్డులో తాచేరుపై కాజ్వే కొట్టుకుపోవడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీరి రవాణా కష్టాలు వర్ణనాతీతం. తాచేరు కాజ్వే కొట్టుకుపోయి నెల రోజులు కావస్తున్నా ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయరామరాజుపేట, కోరుబిల్లి గ్రామాల వారు తమ కల్లాల వద్ద తాచేరు నదిపై తాటి దుంగలతో వారధి ఏర్పాటు చేశారు. ఈ రెండు గ్రామాలకు చెందిన రైతులు పొలాలు, పశువుల పాకలకు దీని మీదుగానే వెళ్లాలి. పది మీటర్ల దూరం ఉండే తాచేరు నది దాటడానికి వారధి లేక చుట్టూ 10కిలోమీటర్లు తిరిగి వడ్డాది రావాల్సి వస్తోంది. దీంతో ప్రమాదమని తెలిసినా తాటి దుంగలతో వారధి ఏర్పాటు చేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. ఏమాత్రం అదుపుతప్పినా నదిలో జారిపోక తప్పదు. కాజ్వే పక్కనున్న కాలువకు గండిపడటంతో సిమెంటు తూములు కూడా కొట్టుకుపోయాయి. కొన్నాళ్ళుగా కురుస్తున్న వర్షాలకు తాచేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ సమయంలో పైన కర్రను పట్టుకుని తాటిదుంగల మీదుగా ఆ ఒడ్డుకు చేరాలంటే కాళ్లు వణుకుతున్నాయని మహిళలు, వృద్ధులు చెబుతున్నారు.

తాటి దుంగలతో ఏర్పాటు చేసిన మార్గంలో రాకపోకలు సాగిస్తున్న రైతులు

వివిధ రంగుల బెల్ట్‌లు సాధించిన విద్యార్థులు

తైక్వాండో కలర్ బెల్ట్ పోటీలు

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక జెడ్‌పి హైస్కూల్ గ్రౌండ్లో ఆదివారం చోడవరం తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో కలర్ బెల్ట్ పోటీలు నిర్వహించారు. చోడవరంకు చెందిన క్రీడాకారులు చుక్కల లాస్య, ఎం.రవిచంద్ర, శారదలు రెడ్ బ్లాక్ బెల్ట్, యన్.రిషితాంజాలి, బి.పర్నిక అరోహి, యస్.జానవి, యస్.ప్రియాంజన్ సాయి, డి సాత్విక్‌లు రెడ్ బెల్ట్, యన్ కేశవర్ధన్, జనలోచన, యమ్ శరణ్య, ఎ.విక్రమ్, షేక్ సభీన ఆజ్మీ, యస్ భీష్మ, యస్ ప్రణిత్, బి చేతన్‌లు గ్రీన్, గ్రీన్ వన్ బెల్ట్, షేక్ బషిత్, కోన మేఘన, యమ్ చరన్ తేజ, జి సౌజన్య, యల్ అనీల్ కుమార్, యమ్ ప్రణీత్‌లు ఎల్లో బెల్ట్, యన్ తేజ అశ్విని, బి యోద ఆదిత్య, జి పూజిత, కె అముల్యలు బ్లూ బెల్ట్‌లు సాధించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డుపై పెద్ద పెద్ద గుంతల్లో నిల్వ ఉన్న వర్షపు నీరు

సూదివలస - పాతవలస రహదారి అధ్వానం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని సూదివలస గ్రామం నుండి పాతవలస వరకు ఉన్న రోడ్డు అధ్వాన స్థితిలో ఉంది. సుమారు రెండు కిలోమీటర్ల మేరకు ఈ రోడ్డు పలుచోట్ల గుంతలు పడి ప్రమాద భరితంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గుంతల్లో నీరు చేరి మరింత పెద్ద గుంతలుగా మారాయి. పాతవలస, మర్రివలస, శృంగవరం, గొట్లాం తదితర గ్రామాల నుండి విశాఖపట్నం వెళ్లాలంటే ఇదే రోడ్డుపై ప్రయాణించాల్సి ఉంది. అయినా ఈ రోడ్డు మరమ్మతుల గురించి అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల నుండి విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పక్కా తారు రోడ్డు నిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పది మంది జూదరులపై కేసు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కరక శివారు ప్రాంతంలో బుచ్చయ్యపేట ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం రాత్రి పేకాట శిబిరంపై దాడి చేసి పదిమందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి 30,170 నగదు స్వాధీనం చేసుకున్నారు. గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బ్రాండిక్స్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన కంటి రోగులను శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యులు పరీక్షలు చేశారు. 140 మంది కంటి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 57 మందికి కాట్రాక్ట్ సర్జరీ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. శిబిరానికి వచ్చిన కంటి రోగులకు మజ్జిగ పలహారాలు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడారు.

కంటి పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ ఉమ్మడి విశాఖ జిల్లా సదస్సు డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి : గర్భిణులు, బాలింతలను గమ్యస్థానాలకు చేర్చి సేవ చేస్తున్న 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని వంటి సమస్యలను పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు యం.బసవరాజు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఎపి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బసవరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 7,800 తక్కువ జీతంతో 102 ఉద్యోగులతో వెట్టిచాకిరి చేయిస్తుందన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని ఎన్నిసార్లు విన్నవించిన ప్రభుత్వం గాని అరబిందో యాజమాన్యం కానీ పట్టించుకోలేదని, పైగా ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 102 అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించే వరకు పోరాటం చేయాలన్నారు. అతి తక్కువ జీతాలతో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చిన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తుందని విమర్శించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్ దేవి ప్రసాద్ మాట్లాడుతూ రాబోయే కాలంలో 102 ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు వై సతీష్, అల్లూరి జిల్లా అధ్యక్షులు వి వాసు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి.కృష్ణ, ఏ నర్సింగరావు, రాజులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బసవరాజు

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు తదితరులు

కష్టపడే వారికి తగిన గుర్తింపు

ప్రజాశక్తి-చోడవరం : పార్టీలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. చోడవరం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా అల్లం మాధవి, డైరెక్టర్లు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కష్టపడి పని చేసిన అనేక మందికి నామినేటెడ్ పదవులతో గౌరవించినట్లు చెప్పారు. అనంతరం మార్కెట్ కమిటీ ఛైర్మన్, డైరెక్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు, కూటమి నాయకులు అల్లం రామ అప్పారావు, జి.మల్లునాయుడు, వ్యవసాయ శాఖ, మార్కెట్ కమిటీ అధికారులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పసలమ్మ పండగలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కె.కోటపాడు, కింతాడ, గుల్లేపల్లి, చంద్రయ్యపేట, కొరువాడ తదితర గ్రామాల్లో పశువులకు దేవత అయినా పసలమ్మ తల్లి పండగలు ఆదివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పశువులన్నింటినీ పసలమ్మ తల్లి దేవాలయం సమీపానికి తరలించి నిలిపి, సంప్రదాయపద్ధంగా గ్రామ పొలిమేరల గుండా చెక్కతో తయారు చేసిన పసలమ్మ తల్లి విగ్రహాలను డప్పు వాయిద్యాలతో సాంబ్రాణి ధూపాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పసలమ్మ తల్లి గుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వసంతకం (పూజ జలాలను) పశువుల మీద పశువుల కల్లాల్లోనూ చల్లడంతో పండుగ పూర్తయింది.

బాలుర వసతి గృహం ముందు వ్యర్థాలు తొలగించరూ..

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరు బిసి బాలుర వసతి గృహం ముందు పేరుకుపోయి ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. వ్యాధుల కాలం కావడం వలన హాస్టల్ చుట్టు పక్కల పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. హాస్టల్ ముందు నీరు నిల్వ ఉండడంతో పాటు చెత్తాచెదారం అక్కడే పడవేస్తున్నారు. వాటిని చూసిన తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడ అనారోగ్యం పాలవుతారోనని భయానికి గురవుతున్నారు. ఈ విషయమై తల్లిదండ్రులు హాస్టల్ వార్డెన్ రమణను అడగగా తను కొత్తగా వచ్చానని, దీని గురించి అధికారులకు తెలియజేశామని, వారు వచ్చి చూసి వెళ్లారని, త్వరలో ఈ సమస్య పరిష్కారం చేస్తామని చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

గతంలో ఉన్న వార్డెన్‌కు, ప్రస్తుత వార్డెన్‌కు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించడానికి ఆలోచిస్తామని చెబుతున్నారే తప్ప ఇప్పటివరకు చర్యలు ఏమి లేవని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించి తమ పిల్లల్ని కాపాడమని కోరుకుంటున్నారు. హాస్టల్ తారు రోడ్డుకు ఆనుకొని ఉందని సంబంధిత అధికారులు చొరవ చేసుకుని శాశ్వత పరిష్కారం దొరికే వరకు తాత్కాలికంగా పేరుకుపోయిన మురికి నీటిని వేరే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పంపించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హాస్టల్ ఎదుట దర్శనమిస్తున్న చెత్త పోగులు

నిరుపయోగంగా వాటర్ ప్లాంట్

ప్రజాశక్తి-కోటవురట్ల : మండల కేంద్రంలోని ప్రభుత్వం పాఠశాలలో లక్షల రూపాయల విలువచేసే వాటర్ ప్లాంట్ గడిచిన 5 సంవత్సరాలుగా వృధాగా పడివుంది. కోవిడ్-19 సమయం అనంతరం విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు గత వైసిపి ప్రభుత్వం అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన వాటర్ ప్యూరిఫై మిషన్ ప్రభుత్వ పాఠశాలకు అందజేసింది. నాటి నేటి వరకు నీటి శుద్ధి యంత్రాన్ని పాఠశాల యాజమాన్యం అందుబాటులోకి తీసుకురాకపోవడంతో విద్యార్థులు పాత నీటి శుద్ధి కేంద్రం నీళ్ల వినియోగిస్తున్నారు. నీటి శుద్ధి ప్లాంట్ వినియోగంలోకి తీసుకురాకపోగా అదే యంత్రానికి చుట్టూ దాదాపు లక్ష రూపాయలు వరకూ ఖర్చు చేసి రక్షణ గిల్స్ ఏర్పాటు చేశారు. దీంతో ఈ యంత్రాన్ని వినియోగంలోకి తీసుకు వస్తారా లేక అలంకారం ప్రాయంగా వదిలేస్తారా అంటూ విద్యార్థులు సహ వారి తల్లిదండ్రులు చర్చించుకుంటున్నారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి శుద్ధి యంత్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుకుంటున్నారు.

నిరుపయోగంగా పడి ఉన్న వాటర్ ప్లాంట్ ఇదే...

కొట్టుకుపోయిన వ్యక్తిని రక్షించిన మెరైన్ పోలీసులు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలో రేవుపోలవరం సముద్ర తీరంలో అలలకు కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడి ఒడ్డుకు చేర్చిన్నట్లు సిఐ మురళి తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ప్రకారం... చోడవరం మండలం గౌరీపట్నం గ్రామానికి చెందిన కర్రి శివసాయి 28 అనే యువకుడు ఆదివారం తన బంధువులతో కలిసి రేవుపోలవరం తీరం వద్ద వచ్చారు. తీరంలో స్నానం చేస్తుండగా పెద్ద అలకు లోనికి కొట్టుకుపోయాడు. దీంతో పెంటకోట మెరైన్ సిబ్బంది ఎస్ఐ దొర, ఎఎస్ఐ కృష్ణ, పిసిఇ చిన్న బాబు, హోమ్ గార్డ్స్ శివ, శ్రీను, అప్పలరాజు గుర్తించి వెంటనే అతనికి లైఫ్ జాకెట్ అందించి ఒడ్డుకి చేర్చి రక్షించారు. అతనికి ఎటువంటి ప్రాణాపాయ స్థితి లేకపోవడంతో బంధువులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

23 వేల స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలానికి 23,000 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరయ్యాయని తహసీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు. సోమవారం తురకలపూడిలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు చేతుల మీదుగా లబ్దిదారులకు పంపిణీ చేస్తామన్నారు. స్మార్ట్ రైస్ కార్డులో పొరపాట్లు ఉంటే సంబంధిత సచివాలయాలలో సరి చేసుకోవచ్చన్నారు. స్మార్ట్ కార్డులతో అవినీతికి తావు లేకుండా రేషన్ పంపిణీ జరుగుతుందని చెప్పారు.

విశ్వ బ్రాహ్మణుల సమావేశం

ప్రజాశక్తి-కోటవురట్ల : విశ్వ బ్రాహ్మణుల సంఘం సమావేశం అమ్మవారి ఆలయ వద్ద ఆదివారం నిర్వహించారు. సందర్భంగా సంఘం అధ్యక్షులు రమణ మాట్లాడుతూ విశ్వ బ్రాహ్మణులు ఎక్కడున్నా శ్రమను కష్టాన్ని నమ్ముకుని బతికే వాళ్లని, అటువంటి శ్రమజీవులకు తమ వంతు సహాయంగా 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షులు వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందజేయాలని కోరారు. అనంతరం సభ్యులకు ప్రమాద బీమా బాండ్లు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శివాజీ, మాణిక్యం, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సహాయం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పరవాడపాలెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్న బంగారి నాగేశ్వరరావు కుటుంబానికి సహాయం అందించారు. నాగేశ్వరరావుపై భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక అక్క ఆధారపడి ఉన్నారు. నాగేశ్వరరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో కుటుంబ పోషణ నిమిత్తం ఆదివారం గొంతిని ముసిలినాయుడు జ్ఞాపకార్థం వారి కుమారుడు గొంతిని శివబాబు 50 కేజీల బియ్యం, వెయ్యి రూపాయలు, కూరగాయలను అందజేశారు. సారిపల్లి అప్పారావు, గొంతిని శివచెంచు నాయుడు, పందిరి కొండబాబు, బన్నికల రమణ రూ.500 చొప్పున నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

సహాయం అందిస్తున్న దృశ్యం

పురుగు మందులు తాగి యువకుల ఆత్మహత్యలు

యుక్త వయస్సు వారికి విక్రయంలో జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో గత నెలలో సుమారు ఎనిమిది మంది వరకు యువకులు పురుగుల మందులు తాగి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కొద్దిపాటి సమస్యలకే, క్షణికావేశానికి గురవుతున్నారు. విచ్చలవిడిగా దొరికే పురుగుల మందులు, గడ్డి మందులు, గుళికలు తాగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. బుచ్చయ్యపేట, రాజాం, సీతయ్యపేట తదితర గ్రామాల్లో పురుగుల మందుల షాపులు ఉన్నాయి. పురుగు మందులు కొనుగోలుకు ఎవరొచ్చినా విక్రయిస్తున్నారు. షాపుల యజమానులు పురుగుల మందుల కోసం వచ్చిన వారి నుండి ఎటువంటి వివరాలు కూడా సేకరించకుండా అమ్మకాలు చేస్తున్నారు. పలువురు యువకులు ఇలా విచ్చలవిడిగా దొరికే పురుగుల మందులను కొనుగోలు చేసి వాటిని తాగి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గత నెలలో ఐతంపూడి గ్రామానికి చెందిన ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పి.భీమవరానికి చెందిన ఓ యువకుడు ఓ వివాహితతో వివాహేతర సంబంధంపై కుటుంబీకులు మందలించడంతో ఘటనా స్థలం నుండి వడ్డాది వెళ్లి పురుగుల మందు కొనుక్కొని అక్కడకక్కడే తాగాడు. ఆ యువకుడు 15 రోజుల నుండి విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వడ్డాది హైస్కూల్లో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని బాలికల తల్లిదండ్రులు గ్రామస్తులు మందలించడంతో ఓ యువకుడు గడ్డి మందు తాగాడు. ఇలా పలు గ్రామాల్లో యువకులు చిన్న చిన్న సంఘటనలకు క్షణికావేశానికి గురై విచ్చలవిడిగా దొరికే పురుగుల మందులను తాగి మరణిస్తున్నారు.

వ్యవసాయ అధికారి సమావేశం

ఈ నేపథ్యంలో మండల వ్యవసాయ శాఖ అధికారి బి భాస్కరరావు ఇటీవల పురుగుల మందుల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. పురుగుల మందులు అమ్మకాల సమయంలో దుకాణ యజమానులు అప్రమత్తంగా ఉండాలని, 18-25 సంవత్సరాల లోపు గల వారు పురుగుల మందుల షాపుకు వస్తే పురుగుల మందు కొనుగోలుకు సంబంధించి తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడిన తర్వాతే అమ్మకాలు చేపట్టాలని సూచించారు. దీనిపై బుచ్చయ్యపేట ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ పురుగుల మందులు కొనుగోలుదారుడు నుండి ఆధార్ వివరాలను సేకరించాలని మండలంలోని పురుగుల మందుల షాపుల యజమానులకు తెలియజేసినట్లు చెప్పారు.

పురుగు మందుల షాపుల యజమానులతో సమావేశమైన మండల వ్యవసాయాధికారి భాస్కరరావు (ఫైల్‌ఫోటో)

దాడి బాధ్యులను కఠినంగా శిక్షించాలి

- గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్
- ఎం.కృష్ణాపురంలో నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న శ్రీరామ్, తదితరులు

ప్రజాశక్తి- మాడుగుల : మండలంలోని ఎం.కృష్ణాపురం గ్రామంలో యాదవ కుటుంబానికి చెందిన కోళ్ల వరహాల నాయుడుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా దాడిని ఖండిస్తూ నిరసన చేపట్టారు.

అనంతరం గంటా శ్రీరామ్ మాట్లాడుతూ, ఎం.కృష్ణాపురానికి చెందిన వరహాలనాయుడుపై ఆదే గ్రామానికి చెందిన మాడుగుల ఎమ్మెల్యే కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నీటిపల్లి రాము, అతని అన్నయ్య సర్వేయర్ నీటిపల్లి నాయుడు, వారి తండ్రి నీటిపిల్లి రాజారావు మూకుమ్మడిగా దాడి చేసి, నానా దుర్భాషలాడుతూ చితక్కొట్టడం దారుణమన్నారు. బాధితుడు అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. తన వరిపొలం గట్టును ఎందుకు తవ్వేస్తున్నారని ప్రశ్నించినందుకు వరహాలనాయుడుపై దౌర్జన్యంగా దాడికి పాల్పడడం దుర్మార్గమన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని శ్రీరాం డిమాండ్ చేశారు. బాధితుడికి న్యాయం చేయకుంటే ఈనెల 18న మాడుగుల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి, కేసులు నీరుగార్చాలని చూసినా, నిందితులపై తగు చర్యలు చేపట్టకున్నా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు.కార్యక్రమంలో కోళ్ల రాజుబాబు, మువ్వల గణేష్, మొల్లి అప్పారావు, మొల్లి గణేష్, గ్రామపెద్దలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాజయ్యపేటలో వైద్య శిబిరం

వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైద్యులు, అతిథులు

ప్రజాశక్తి నక్కపల్లి : మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో పిక్కి కోటి (కన్నాలు) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ పవన్ సాయి హాస్పటల్ వైద్యులు డాక్టర్ కాంచన, డాక్టర ఇతిస్ అక్షయరాజ్, డాక్టర్ ఎస్ తోసిఫ్, డాక్టర్ సుధా మాధురి, డాక్టర్ హేమంత్ కుమార్, ఐమా నేత్ర సోషల్ వర్కర్ గండుపల్లి డిల్లేశ్వరి సహాయ సహకారాలతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని పవన్ సాయి హాస్పిటల్ సిఇఒ రామారావు, ట్రైనీ ఎస్ఐ సాహిబా అంజుమ్ ప్రారంభించారు. రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మధుమేహం, అధికరక్తపోటు, దంత సమస్యలు, కీళ్ల నొప్పులు, గుండె పరీక్ష, తదితర వ్యాధులకు పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో మత్స్యకార జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కంబాల అమ్మోరయ్య, నానాజీ, సింహాద్రి రాజయ్యపేట టిడిపి నాయకులు పిక్కి రాంబాబు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

కొత్త ఎస్ఐని అభినందిస్తున్న స్థానిక నేతలు

ప్రజాశక్తి- నాతవరం : నాతవరం ఎస్ఐగా వై.తారకేశ్వరరావు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గొలుగొండ మండలం కృష్ణదేవిపేట పోలీసుస్టేషన్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతి ‘ద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈస ందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బందితోపాటు పలువురు స్థానిక నేతలు కొత్త ఎస్ఐ తారకేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అయ్యన్నపాలెం జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని అయ్యన్నపాలెం జంక్షన్‌లో స్థానిక ఎస్ఐ పి.రామారావు ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మోటారు సైకిళ్లను, కార్లను ఆపించి డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు, ఇన్సూరెన్స్, హెల్మెట్, సీట్‌బెల్ట్, ఇతర ట్రాఫిక్ నిబంధనపై సమగ్ర పరిశీలన జరిపారు. ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచేందుకు పోలీసులు కట్టుదిట్టమైన తనిఖీలు చేశారు. నిబంధనలను పాటించని వాహనదారులకు జాగ్రత్తలు సూచించారు. కొందరికి జరిమానా విధించారు. రోడ్డు ప్రమాదాల నివారణా చర్యల్లో భాగంగా ప్రజలకు భద్రత కల్పించేందుకు ఇటువంటి వాహన తనిఖీలు రెగ్యులర్‌గా నిర్వహిస్తామని ఎస్ఐ రామారావు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్నసమారాధన

అన్నసమారాధనలో పాల్గొన్న దిబ్బపాలెం గ్రామస్తులు

ప్రజాశక్తి- చీడికాడ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో కూటమి నాయకుల ఆర్థిక సహకారంతో గల్లీ బాయ్స్ క్లవర్ బాయ్స్, గ్రామ యువత ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు గ్రామంలో జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిటిసి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఏటా దిబ్బపాలెంలో వినాయక చవితి ఉత్సవాలను వేడుకగా జరుపుకుంటున్నామన్నారు. ఈ ఏడాది కూటమి నేతల ఆర్థికసాయంతో అన్నసమారాధన, ఇతర కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అనంతరం బాణసంచా పేలుళ్లు, కోటాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో భారీ ఊరేగింపు నిర్వహించి, గణనాధుని నిమజ్జనం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, యువత పాల్గొన్నారు

అరకులోయలో భారీ వర్షం

ప్రజాశక్తి- అరకులోయ: పర్యాటక ప్రాంతమైన అరకులోయ పరిసరాల్లో దివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ కాయడంతో స్థానికులు పర్యాటకులు ఎండ వేడిమి తట్టుకోలేక ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఇంతలోనే భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో వాహన చోదకులు స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. అయితే గిరిజన రైతులు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అరకులోయ, అనంతగిరి, విశాఖ ప్రధాన రహదారి ఘాట్ రోడ్లు కుండ పోత వర్షంతో భారీగా నీరు నిలవడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు.

ఎరువులకు పడిగాపులు

ఎరువుల కోసం క్యూలైన్లలో వేచియున్న గిరిజన రైతులు

ప్రజాశక్తి-చింతపల్లి : ఎరువుల కోసం చింతపల్లిలో గిరిజన రైతులు ఆదివారం భారీగా పోటెత్తారు. ఉదయం చింతపల్లికి యూరియా ఎరువు లోడు రాగానే స్థానిక డీలర్ వద్ద రైతులు పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. రైతులు ఆధార్ నంబర్లతో నమోదు చేసుకుని యూరియా ఎరువును తీసుకున్నారు.

అందిన యూరియా తమ అవసరాలకు సరిపోవడం లేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎరువులను ఎక్కువ మొత్తంలో కేటాయించాలని డిమాండ్ చేశారు.

సిఐటియు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-చింతపల్లి : సిఐటియు మండల కమిటీ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సిఐటియు విస్తృత స్థాయి సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్‌గా, చిరంజీవి, కో-కన్వీనర్‌గా పెంటమ్మ, మరో 23 మంది మండల కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. మండలంలోని 16 రంగాల నుంచి ఈ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ రానున్న మూడు సంవత్సరాల కాలంలో మండలంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై అప్రమత్తగాఉండి ప్రజల తరపున పోరాటాలకు సమాయత్తం కావాలన్నారు.. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ, వెంకటి, ఇందు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి

అమలగుడ గిరిజనుల ఆందోళన

ఆందోళన చేస్తున్న అమలగుడ గిరిజనులు

ప్రజాశక్తి- అనంతగిరి : మండల కేంద్రానికి కూతవేటు దూరంలో వున్న అమలగుడ గ్రామానికి ప్రభుత్వం తక్షణమే రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆ గ్రామ గిరిజనులు ఆదివారం ఆందోళన చేపట్టారు. కనీస రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతునామని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామని కూటమి ప్రభుత్వ నేతలు ప్రకటించడంతోపాటు ఏజెన్సీలోని పలు రోడ్లుకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నిధుల మంజూరు, శంకుస్థాపనలు చేస్తున్న నేపథ్యంలో తమ గ్రామంపై కూడా దృష్టి సారించాలని అమలగుడ గిరిజనులు వేడుకుంటున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కొర్రా రామసందర్, రామదాసు, తదితరులు మాట్లాడుతూ మండల కేంద్రానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, తమ గ్రామానికి రోడ్డు, ఇతర సౌకర్యాల కల్పనపై ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి సమీపంలో తాడిగూడ జలపాతం ఉందని, అక్కడ వరకు రోడ్డు సౌకర్యం కల్పించిన ప్రభుత్వ యంత్రాంగం తమ గ్రామాన్ని మాత్రం నిర్లక్ష్యంగా పట్టించుకోవడం లేదని వాపోయారు. మూడేళ్ల క్రితం తాడిగూడ మెయిన్ రోడ్డు నుండి అర కిలోమీటర్ వరకు తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మించి వదిలేశారని ఆరోపించారు. ంతో నిత్యవసరాలతోపాటు అత్యవసరానికి నానా అగచాట్లు పడతున్నామని. ముఖ్యంగా గర్భిణులు, రోగుల పాలిట రోడ్డు లేమి శాపంగా ఉందని, . ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అమలగుడకు శాశ్వత రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

గాడిచర్లకు ఘననివాళి

నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ దమయంతి

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : రాష్ట్ర గ్రంథాలయోద్యమ పితామహుడు, స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచర్ల. హరిసర్వోతామరావు జయంతిని ఆదివారం స్థానిక శాఖాగ్రంథాలయంలోఘనంగా నిర్వహించారు. గాడిచర్ల చిత్రపటానికి లైబ్రేరియన్ దమయంతి ఆధ్వర్యంలో పాఠకులు రామచంద్రరావు, అప్పలస్వామి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయోద్యమానికి గాడిచర్ల చేసిన సేవలను కావ్య వివరించారు. స్వాతంత్ర సమరంలో గ్రంథాలయాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడానికి, ప్రజలను స్వాతంత్ర్య ఉద్యమం పట్ల కార్యోన్ముఖులను చేయడానికి హరిసర్వోత్తమరావు ఎంతో కృషి చేశారని కొనియాడారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ మాట్లాడుతు స్వాతంత్ర్య ఉద్యమంలో దక్షిణ భారత దేశంలోనే తొలి రాజకీయ ఖైదీ గాడిచర్ల సర్వోత్తమరావు అని, ఎడిటర్ అన్న పదానికి సంపాదకుడు అని నిర్వచనం చెప్పిన మహనీయుడని కొనియాడారు. హిందీ భాషాదినోత్సవాన్ని కూడా నిర్వహించారు.

ఆచార్యులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

ఆచార్యులును అవార్డుతో సత్కరిస్తున్న బ్రాహ్మణ సేవా సమాఖ్య

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌విఎస్. ఆచార్యులకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం వరించింది. ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య, రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆచార్యులకు పురస్కారాన్ని అందజేశారు. ఉపాధ్యాయవృత్తిలో అంకిత భావంతో పనిచేసిన ఉభయ తెలుగు రాష్ట్రాలలోని బ్రాహ్మణ ఉపాధ్యాయులను గుర్తించి వారికి పురస్కారాలను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా తమ్మునాయుడు

తమ్మునాయుడుకు నియామకపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-రోలుగుంట : చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా రోలుగుంట మండలం బుచ్చింపేట గ్రామానికి చెందిన కర్రి తమ్మునాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం చోడవరం ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్.రాజును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక మండల నేతలు, కార్యకర్తలు తమ్మునాయుడుకు శుభాభినందనలు తెలిపారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

- ఏలేరు కాలువ గట్లను గుల్ల చేస్తున్న అక్రమార్కులు
- రేయింబవళ్లు దందా.. చోద్యం చూస్తున్న అధికారులు

ఇష్టారాజ్యంగా తవ్వేసిన ఏలేరు కాలువ గట్టు

ప్రజాశక్తి-నర్సీపట్నం/ కోటవురట్ల : ఏలేరు కాలువ మట్టి అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. రేయింబవళ్లు తేడా లేకుండా, కాలువ గట్టు మట్టిని లారీలు, ఇతర వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ, మట్టి మాఫియా సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీని వల్ల భవిష్యత్‌లో విశాఖకు తాగునీరు అందించే ఈ కాలువకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని భావిస్తున్నారు. అధికారపార్టీ నేతలు ఈ దందాలో భాగస్వాములు కావడంతో ఎవరూ పట్టించు కోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

నర్సీపట్నం కోటవురట్ల మండలాల మండలాల మీదుగా విశాఖ నగరానికి తాగునీరు, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన నీటిని గోదావరి నుంచి తరలించేందుకు మూడున్నర దశాబ్దాల క్రితం ఏలేరు కాలువ నిర్మించారు. పల్లె,పట్టణాలని తేడాలేకుండా రియల్‌ఎస్టేట్ వ్యాపారం, లేఅవుట్లు విరివిగా వెలుస్తుండడంతో, వాటిని చదును చేసేందుకు మట్టి అవసరం కావడంతో ఏలేరు కాలువ గట్టు మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వేసి తరలించుకుపోతున్నారని స్థానికులు అంటున్నారు. పెద్దఎత్తున మట్టి తవ్వకాలతో అక్రమార్కులు లక్షలు ఆర్జిస్తూ, ఏలేరు కాలువను ప్రమాదాల్లోకి నెట్టేస్తున్నారని స్థానికులు అంటున్నారు.

చెర్లోపాలెం, పాములవాక, వేములపూడి, అన్నవరం, పరిసర ప్రాంతాల మీదుగా ప్రవహిస్తున్న ఏలూరు కాలువ సమీపంలో మట్టిని రాత్రి పగలు అని తేడా లేకుండా తరలించుకు పోతున్నారు, నర్సీపట్నం, కోటవురట్ల రెండు మండలాల అధికారపార్టీ నాయకులు అండదండతో మట్టి అక్రమ రవాణా సాగు తోందని ఆరోపణలు న్నాయి. ఏలేరు కాలువ మట్టిని అత్యధికంగా నర్సీపట్నం ప్రాంతంలోని ప్రైవేటు లేఅవుట్లుకు తరలించుకు పోతున్నారు, ఒక్కో లారీ మట్టికి దాదాపు రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ వ్యవహారంపై సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమీప ప్రాంత రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,

భారీ వాహనాలతో పాడౌతున్న రోడ్లు

ఏలేరు కాలువ మట్టిని భారీ వాహనాలతో తరలించుకుపోతున్న క్రమంలో ఇక్కడి రోడ్లు పూర్తిగా శిథిలమై పోతున్నాయని ఆయా ప్రాంత సర్పంచులు, నాయకులు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, పలు మార్లు మట్టి అక్రమ రవాణాను అడ్డుకొని నిలువరించే ప్రయత్నం చేసినా, మట్టిమాఫియా దౌర్జన్యంగా వ్యవహరిస్తూ, దాడికి దిగే ప్రయత్నం చేయడంతో మిన్నకుండక తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. మట్టి లారీలను అడ్డుకోవడానికి మీరేవరంటూ నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతోపాటు, అధికారులకు ఫిర్యాదు చేసుకోండి, చేతనైంది చేసుకోండంటూ ఎదురుదాడి చేస్తున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అవసరమైతే ఫైన్ చెల్లిస్తామే తప్ప, మట్టి తరలింపును ఆపేది లేదంటూ ప్రజలకు సవాల్ విసురుతున్నారని అంటున్నారు. ఏలేరు కాలువ నిర్వహణకు సంబంధిత నీటిపారుదలశాఖ అదికారులు, రెవెన్యూ, పోలీసులు, ఇతర విభాగాల అధికారులెవరూ ఈ మట్టిదందాను పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని స్థానికులు ఆవేదన చెందుతుండగా, లక్షల్లో ముడుపులు ముట్టజెబుతున్నామని అక్రమార్కులు బహిరంగంగా చెబుతుండడంతో విస్తుపోతున్నారు. మట్టి త్రవ్వకాలు చేపడుతున్న ప్రాంతంలో హైటెన్షన్ విద్యుత్ లైన్లు కూడా ఉండడంతో ఎపుడు ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని సమీపప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు, సంబంధిత అధికారులు ఇప్పటికైనా సంబంధిత అధికారులు కళ్లు తెరిచి, మట్టిమాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలతోపాటు రైతులు కోరుతున్నారు.

మట్టి తరలింపునకు సిద్ధంగా ఉన్న టిప్పర్

రోడ్డు విస్తరణ నిర్వాసితులకు

2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని హరిపాలెం గ్రామంలో ఆదివారం రోడ్డు విస్తరణ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రధాన రహదారిపై ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ పలుమార్లు టిడిఆర్ బాండ్లు వద్దని ఆర్డిఓ కార్యాలయంలోనూ, జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనూ వినతులు ఇచ్చినట్లు చెప్పారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నగదు రూపంలో పరిహారం చెల్లించాలని నిర్వాసితులందరూ ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే టిడిఆర్ బాండ్లకు రోడ్డు విస్తరణ నిర్వాసితులు 90 శాతం మేరకు అంగీకరించారని చెప్పటం సరికాదన్నారు. టిడిఆర్ బాండ్లను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రెవెన్యూ గ్రామాల వారీగా గజానికి రూ.16,000 నుంచి 25 వేల రూపాయల వరకు పరిహారం ఇస్తామని అధికారులు నిర్వాసితుల వద్ద బ్యాంక్ అకౌంట్లు, ఆధార్ కార్డులు సేకరించారని గుర్తు చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్.రాము, కో కన్వీనర్ కే రామ సదాశివరావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ఎస్ బ్రహ్మాజీ కే బాబురావు బి రామ్‌కుమార్, కే సోమునాయుడు, బుద్ధ రంగారావు, ఎస్ కనుమునాయుడు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నిర్వాసిత నాయకులు

సీతారాం ఏచూరికి నివాళి

ప్రజాశక్తి-రాంబిల్లి : రాంబిల్లి మండల కేంద్రంలో సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు మాట్లాడుతూ, కామ్రేడ్ సీతారాం ఏచూరి కార్మిక కర్షకుల కోసం తన జీవితాన్ని ధారబోసిన మహనీయుడని పేర్కొన్నారు. లౌకికవాదాన్ని, భారత రాజ్యాంగాన్ని కాపాడాలని, సమ సమాజ నిర్మాణం కోసం అనేక పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. ఆయన బాటలో కార్మిక రాజ్యం కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, చందక రామకృష్ణ, వై రాము, ధోని కాసియా, కార్మిక సంఘాల నాయకులు భూపతి అప్పారావు, డి.నరసింగరావు, వి.ఆదిరెడ్డి, శ్రీను, పారిపిల్లి తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : న్యాయవాదుల రక్షణకు చట్టాన్ని తీసుకురావాలని ప్రముఖ న్యాయవాది ఐఆర్.గంగాధర్ అన్నారు. అనకాపల్లి పట్టణంలో ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో న్యాయవాదులపై దాడులు అంతకంతకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటక రాష్ట్రం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకువచ్చిందని, రాజస్థాన్ రాష్ట్ర శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లు ఒక అంగీకారానికి వచ్చి కార్యాచరణకు దిగవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పిఎస్.అజయ్ కుమార్ మాట్లాడుతూ అనకాపల్లిలో కోర్టులన్నీ అద్దె భవనంలోనే నడుస్తున్నాయని, మౌలిక వసతులతో కూడిన సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఇళ్ళ అవినాష్, ఓడిబోయిన రాంబాబు, చిట్టా జయశ్రీ, జి.బాలప్రభ, వడిసెల కస్తూరి, న్యాయ శాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక

ఇంజనీర్స్ డే ప్రత్యేక అనుబంధం

భారతరత్న శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య
166వ జయంతి

Advt. Feature

విశాఖపట్నం | సోమవారం 15-09-2025 | 8 పేజీలు



మహా మనిషి..

మోక్షగుండం విశ్వేశ్వరయ్య

◆ ఇంజనీరింగ్ పితామహుడు - నవ భారత నిర్మాత ◆ నేడు ఆ మహనీయుని జయంతి - ఇంజనీర్స్‌డే

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఆయన భారత జాతి మదిలో మెదిలే ఓ గొప్ప ఇంజనీరింగ్ అద్భుతం. భువిపై నడయాడిన మహనీయ రూపం. గొప్ప మేధావి, విశేష పాలనాదక్షుడు, ప్రతిభాశాలి, నిష్కళంక చరితుడు, నవ భారత నిర్మాత, భారతీయ ఇంజనీరింగ్ రంగానికి పితామహుడు. ఇంతలా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న ఆ మహనీయుడే మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆ పేరే నిత్య స్ఫూర్తి. ఆయన బాట.. సదా అనుసరణీయం. సేవలు.. చిరస్మరణీయం. నేడు ఆ మహనీయుని జయంతి. ఆయన జన్మించిన రోజును ఏటా ఇంజనీర్స్ డేగా నిర్వహిస్తూ ఆ ధీరోదాత్తునికి యావత్తు దేశం ఘన నివాళి అర్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన బాల్యం, విద్యాభ్యాసం, చూపిన ప్రతిభ, సాధించిన విజయాలు, భారతీయ ఇంజనీరింగ్ రంగానికి తెచ్చిన వన్నె గురించి ఓసారి పరికించిచూద్దాం.

విశ్వేశ్వరయ్య పూర్వీకులు ప్రస్తుత ప్రకాశం జిల్లా గిద్దలూరు సమీపంలోని మోక్షగుండం అనే గ్రామంలో ఉండేవారు. 17వ శతాబ్దంలో విశ్వేశ్వరయ్య తాతగారు కుటుంబంతో సహా నాటి మైసూరు సంస్థానంలోని కోలారు జిల్లా చిక్‌బళ్లాపూరు పట్టణంలో స్థిరపడ్డారు. ఆ కుటుంబీకులు ఆ ప్రాంత పరిపాలకుల వద్ద అనేక పదవులు నిర్వహించి ప్రసిద్ధికెక్కారు. వారిలో లక్ష్మీపతిభట్టు అనే ఆయన మంత్రిగా పని చేశారు. ఆయన సేవలకు ప్రతిఫలంగా నాలుగైదు గ్రామాలు లభించాయి. వీటిల్లో ఒకటి ముద్దుపల్లి. ఇదే తరువాత 'ముద్దేనహళ్లి' అయింది. ఈ గ్రామంలో 1861 సెప్టెంబరు 15న శ్రీనివాసశాస్త్రి, వెంకటలక్ష్మమ్మ దంపతులకు విశ్వేశ్వరయ్య జన్మించారు.

విశ్వేశ్వరయ్య 15 ఏళ్లవాడుగా ఉన్న సమయంలో తండ్రి మృతి చెందారు. ఆ సమయంలో చిక్‌బళ్లాపూర్‌లో ఎనిమిదో తరగతి ఉత్తీర్ణుడైన విశ్వేశ్వరయ్య పైచదువులు సాగించడానికి ఇబ్బంది ఏర్పడింది. అతడి మేనమామ రామయ్య బెంగుళూరులో ఉండేవాడు. మేనల్లుడు ప్రతిభావంతుడు కావడంతో అతడిని తనవద్దకు రప్పించుకుని 1875లో వెస్లియన్ మిషన్ హైస్కూలులో చేర్పించాడు. మెట్రిక్యులేషన్ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు విశ్వేశ్వరయ్య. సెంట్రల్ కాలేజీలో గణితం, ఆంగ్ల విషయాల్లో విద్యార్థిగా 1881లో ప్రథమ (మిగతా 5లో..)



464 కిలోమీటర్లు.. 6 వరుసలు

Engineer's Day Greetings

Our Tribute to the Greatest Engineering Father of the Nation
SRI MOKSHAGUNDAM VISVESVARAYA
on 15th September Engineers Day
Wishing Every Civil Engineers
a Very Happy and Joyous
Engineer's Day

DISTRICT HEAD HOUSING
EEs, DEEs, AEs, MICs & Other Staff
A.P. STATE HOUSING CORPORATION LTD
VISAKHAPATNAM

◆ విశాఖపట్నం - రాయ్‌పూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే
◆ ఎపి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మధ్య గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా నిర్మాణం
◆ త్వరలోనే అందుబాటులోకి.. ◆ ఇంజినీరింగ్ అద్భుతంగా జంట సొరంగాలు

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల మధ్య సౌకర్యవంతమైన రవాణా లక్ష్యంగా చేపట్టిన హరిత జాతీయ రహదారి నిర్మాణం చివరి దశకు చేరుకుంది. ఈ రహదారి విశాఖపట్నం-రాయ్‌పూర్ మధ్య ఆరు వరుసల ఎకనామిక్ కారిడార్, ఎక్స్‌ప్రెస్ హైవే ఎన్.హెచ్ 130 సీడీగా రూపుదిద్దుకుంటోంది.

దూరాభారాన్ని తగ్గించేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా 20 వేల కోట్ల రూపాయల ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులతో కేంద్రం ఈ రహదారిని చేపట్టింది. దీనికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయగా, వచ్చే ఏడాది ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో హరిత జాతీయ రహదారి నిర్మాణం ఎక్కడి నుంచి ఎక్కడికి జరుగుతోంది, దీని నిర్మాణం తీరు, అంతర్గత మార్గాలు, రహదారి ప్రత్యేకతలను తెలుసుకుందాం.

గ్రీన్ ఫీల్డ్ హైవే అనకాపల్లి జిల్లా సబ్బవరం వద్ద కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి నుంచి మొదలై విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల మీదుగా వెళ్తుంది. ఏపీలో 100 కిలోమీటర్లు నాలుగు ప్యాకేజీలుగా, ఒడిశాలో 241 కిలోమీటర్లు 11 ప్యాకేజీలుగా, ఛత్తీస్‌గడ్‌లో 123 కిలోమీటర్లు 3 ప్యాకేజీలుగా కలిపి మొత్తం 464 కిలోమీటర్లు 18 ప్యాకేజీలుగా పనులు చేస్తున్నారు.

విశాలమైన రహదారి

నాలుగు ప్యాకేజీలుగా పనులు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 99.629 కిలోమీటర్ల రహదారి పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టారు. ప్యాకేజీ-1 కింద పార్వతీపురం మన్యం జిల్లాలోని పాచిపెంట మండలం ఆలూరు నుంచి మెంటాడ మండలం జక్కువ వరకు, ప్యాకేజీ-2లో జక్కువ నుంచి విజయనగరం జిల్లా గంట్యాడ మండలం కొర్లాం వరకు, ప్యాకేజీ-3లో కొర్లాం నుంచి కొత్తవలస మండలం కంటకాపల్లి వరకు, ప్యాకేజీ-4 కింద కంటకాపల్లి నుంచి అనకాపల్లి జిల్లా సబ్బవరం వరకు పనులు చేపట్టారు.

రహదారి పనుల్లో ప్యాకేజీ-3లో పూర్తిగా, ప్యాకేజీ-2లో కొన్ని మినహా పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ప్యాకేజీ-1, ప్యాకేజీ-4లో వంతెన పనులు జరుగుతున్నాయి. ప్యాకేజీ-4లో నాలుగు కిలోమీటర్ల రహదారి పనులు మిగిలి ఉన్నాయి. అంతర్గత మార్గాలకు భూసేకరణలో కొత్తవలస మండలంలో కొంత భూమిపై కోర్టు వివాదం నెలకొంది. ఏపీలో 90శాతం పనులు పూర్తయ్యాయి. ప్యాకేజీ 2, 3, 4ల్లో భూసేకరణ సమస్యల కారణంగా 2.5కిలోమీటర్ల మేర పనులు నిలిచిపోయాయి. కోర్టు కేసులు ఉండటంతో భూసేకరణ పెండింగ్‌లో ఉంది.

ఐదు చోట్ల అంతర్గత మార్గాలు

విశాఖపట్నం-రాయ్‌పూర్ యాక్సెస్ కంట్రోల్ హైవే ఆరు వరుసలతో నిర్మిస్తున్నారు. సబ్బవరం వద్ద ఈ హైవే కోల్‌కత్తా-చెన్నై హైవేలో కలిసేచోట టంప్రెట్ ఇంటర్ ఛేంజ్ నిర్మిస్తున్నారు. ఈ రహదారికి సర్వీస్ రోడ్లు ఉండవు. రాష్ట్ర పరిధిలో ఆరు చోట్ల మాత్రమే ఈ హైవేలోకి ప్రవేశించేందుకు, హైవే నుంచి బయటకు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో ఐదు చోట్ల అంతర్గత మార్గాలు సిద్ధమయ్యాయి.

ఇందులో కొత్తవలస మండలంలో దత్తి, చిన్నిపాలెం, ఉత్తరాపల్లి మధ్య, జామి మండల కేంద్రం వద్ద, గంట్యాడ మండలంలోని కొర్లాం, కొండ తామరాపల్లి, బురుడు మధ్య, మెంటాడ మండల కేంద్రం, చిట్టయ్యవలస మధ్య, గజపతినగరం మండలంలోని కొనిస, పాచిపెంట మండలంలోని మాతుమూరు, సారాయివలస, గురివినాయుడు పేట మధ్య ఇంటర్ ఛేంజింగ్ మార్గాలకు అవకాశం కల్పించారు.

పెట్రోల్ బంకులు, హోటళ్లు, విశ్రాంత గదుల ఏర్పాట్లు

హరిత జాతీయ రహదారి మార్గంలో వంతెనలున్న ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రతి రెండు కిలోమీటర్ల దూరానికి ఒక చోట టెలిఫోన్ సదుపాయం కల్పించారు. వీటితో పాటు సౌరశక్తితో పనిచేసే సీసీ కెమెరాలూ అమర్చారు. రహదారి డివైడర్‌పై పూల మొక్కలు నాటారు. అయితే టోల్ ప్లాజాలు ఉన్న ప్రాంతాల్లోనే రాష్ట్ర రహదారుల్లోకి వెళ్లేందుకు, జాతీయ రహదారిపైకి వచ్చేందుకు వీలు ఉంటుంది. వీటి వద్ద పెట్రోల్ బంకులు, హోటళ్లు, విశ్రాంత గదులు ఏర్పాటు చేస్తారు. కొత్తవలస మండలంలో గులివిందాడ వద్ద, పాచిపెంట మండలంలోని కొటికిపెంట, కేసలి మధ్య ప్రయాణికులు, వాహన చోదకులకు వసతులు కల్పిస్తారు. ఈ రెండు చోట్ల ప్రవేశాల వద్ద టోల్ ఫీజు వసూలు చేస్తారు. రహదారిపై ఎంత దూరం ప్రయాణిస్తే అంత దూరానికే రుసుం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

భూమిపై కోర్టు వివాదం

విశాఖపట్నం-రాయ్‌పూర్ యాక్సెస్ కంట్రోల్ హైవేను ఈ ఏడాది అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిర్ణయించినా, కొన్ని అడ్డంకులు నెలకొన్నాయి. ఒడిశా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల్లోని కొన్ని ప్యాకేజీలు ఆలస్యంగా మొదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ పరిధిలోని 4ప్యాకేజీ పనుల్లో ప్యాకేజీ-3లో పూర్తిగా, ప్యాకేజీ-2లో కొన్ని మినహా రహదారి పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ప్యాకేజీ-1, ప్యాకేజీ-4లో వంతెన పనులు జరుగుతున్నాయి. ప్యాకేజీ-4లో నాలుగు కిలోమీటర్ల రహదారి పనులు మిగిలి ఉన్నాయి. అంతర్గత మార్గాలకు భూసేకరణలో కొత్తవలస మండలంలో కొంత భూమిపై కోర్టు వివాదం నెలకొంది.

జాతీయ రహదారి పనులు ఏపీలో 90శాతం పనులు పూర్తయ్యాయి. ప్యాకేజీ 2,3,4ల్లో భూసేకరణ సమస్యల కారణంగా 2.5కిలోమీటర్ల మేర పనులు నిలిచిపోయాయి. కోర్టు కేసులు ఉండటంతో భూసేకరణ పెండింగ్‌లో ఉంది. ఈ సమస్య కొలిక్కి వస్తే ఏపీ పరిధిలోని 100 కిలోమీటర్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది. మొత్తం పనులన్నీ త్వరలోనే పూర్తై పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. ఈ హైవే అందుబాటులోకి వస్తే, ఛత్తీస్‌గడ్, ఒడిశాలోని వివిధ ప్రాంతాలకు విశాఖపట్నం పోర్టు నుంచి సులువుగా కనెక్టివిటీ లభిస్తుంది.

విశాఖపట్నం - రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఈ ట్విన్ టన్నెల్ ఇంజినీరింగ్ అద్భుతమనే చెప్పాలి. 3.42 కిలోమీటర్ల ఈ జంట సొరంగం త్వరలో అందుబాటులోకి రానుంది.

Engineers' Day Greetings..

Our Tribute to the Greatest Engineering Father of the Nation
SRI MOKSHAGUNDAM VISVESVARAYA on
15th September Engineers Day
Wishing Every Port Authority
Civil Engineers a Very Happy and
Joyous Engineer's Day

V. SRINU
QUALITY ENGINEERING SERVICES
ENGINEERS & CONTRACTORS
Plot No. E-9, 1st Floor, Above Kotak Mahindra Bank,
Opp. NRI Hospital, Seethammadhara, VSP-530013.

Engineers' Day Greetings..

Our Tribute to the Greatest Engineering Father of the Nation
SRI MOKSHAGUNDAM VISVESVARAYA on
15th September Engineers Day
Wishing Every Port Authority
Civil Engineers a Very Happy and
Joyous Engineer's Day

SRCR CONSTRUCTIONS
Flat No. 301, Vasuvilla, # 4-45-8/6,
Above SBI, Peda Waltair, Visakhapatnam-530 017

అపర భగీరథుడు కె.ఎల్.రావు

- నవభారత నిర్మాణంలో అద్వితీయ పాత్ర
- నీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అగ్రగణ్యుడు



నవ భారత నిర్మాణంలో ప్రముఖ ప్రాత పోషించిన ప్రఖ్యాత ఇంజనీర్లలో డాక్టర్ కె.ఎల్.రావు అగ్రగణ్యులు. సర్ అర్థర్ కాటన్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి యోధానుయోధుల సరసన నిలిచే ప్రముఖ ఇంజినీర్. దేశంలో నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో ఆయన పాత్ర సాటిలేనిది.1902 జూన్ 6న విజయవాడ సమీపంలోని కంకిపాడులో పద్మభూషణ్ డాక్టర్ కె.ఎల్.రావు జన్మించారు. డాక్టర్ కెఎల్.రావు అసలు పేరు కానూరి లక్ష్మణరావు. జాతీయ పోరాటంలో పాల్గొన్న కుటుంబం నుంచి వచ్చారు. రాష్ట్ర ప్రథమ శాసనసభ స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు, కొమర్రాజు లక్ష్మణరావు, డాక్టర్ అచ్చమాంబ, కె.ఎల్.రావుకు సమీప బంధువులు.

కెఎల్.రావు జీవిత విశేషాలు

కానూరు లక్ష్మణరావు (కెఎల్.రావు)ది కృష్ణాజిల్లా కంకిపాడు స్వగ్రామం. రైతు కుటుంబంలో జన్మించిన ఆయన 9వ ఏటనే తండ్రిని కోల్పోయారు. పాఠశాలలో ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు ఒక కంటిచూపును కోల్పోయరు. పాఠశాల విద్యను స్వగ్రామంలోనే పూర్తి చేసిన కెఎల్.రావు ఇంటర్మీడియేట్‌ను మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అభ్యసించారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి బిఇ ఇంజనీరింగ్ పట్టా పొందారు. అదే యూనివర్శిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీని అందుకున్నారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి ఇంజినీరింగ్ మాస్టర్ డిగ్రీని పొందిన మొట్టమొదటి వ్యక్తి కెఎల్.రావు. అనంతరం 1939లో యుకెలోని బర్మింగ్‌హామ్ యూనివర్శిటీ పిహెచ్‌డి అందుకున్నారు.
ఇంజనీరుగా రంగూన్ కళాశాలలో ప్రొఫెసర్‌గా ఉద్యోగబాధ్యతలు చేపట్టారు. యునైటెడ్ కింగ్‌డమ్ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొంతకాలం పని చేశారు. ఆ సమయంలో 'స్టెక్చురల్ ఇంజినీరింగ్ అండ్ రెయిన్‌ఫోర్డ్స్ కాంక్రీట్' అనే అంశంపై రాసిన పుస్తకం నేటి సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మార్గసూచికగా ఉంది. 1946లో భారతదేశం తిరిగి వచ్చారు. ఇండియా వచ్చిన ఆయన మద్రాసు ప్రభుత్వంలో డిజైన్ ఇంజినీరుగా బాధ్యతలు నిర్వహించారు.ఆనాటి మద్రాస్ ప్రభుత్వంలో డిజైన్ ఇంజనీర్‌గా చేరారు. 1950లో ప్రముఖ ఇంజినీర్, కేంద్ర జల వనరుల శాఖ చైర్మన్ డాక్టర్ ఎ.ఎన్. ఖోస్లో పిలుపు మేరకు కేంద్ర జల, విద్యుత్ కమిషన్‌లో డిజైన్స్ డైరెక్టర్‌గా చేరారు. 1954లో చీఫ్ ఇంజినీర్ అయ్యారు. 1957లో ఉద్యోగ విరమణ వరకు సిడబ్ల్యుసి సభ్యుడుగా కొనసాగారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా 1957 నుంచి 1967 వరకు సిడబ్ల్యుసి సభ్యునిగా కొనసాగే అరుదైన అవకాశం డాక్టర్ కె.ఎల్.రావుకు దక్కింది.

రాజకీయ జీవితం

డాక్టర్ నీలం సంజీవరెడ్డి సలహా మేరకు 1962లో డాక్టర్ కె.ఎల్.రావు విజయవాడ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేశారు. కేజవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ మంత్రివర్గాల్లో పని చేశారు. ఆయన దూరదృష్టి వల్ల అనేక ప్రాజెక్టులు, డ్యాముల నిర్మాణం జరిగింది. ఆ సమయంలో అనేక నీటిపారుదల ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో కీలక బాధ్యత నిర్వహించారు. అనేక రాష్ట్ర ప్రభుత్వాలకు నీటి ప్రాజెక్టుల విషయంలో విలువైన సలహాలు అందించారు. మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో ఆయన నాయకత్వంలో నాగార్జున సాగర్, లోయర్ భవానీ, మలాంపూజా, కోశీ హీరాకుడ్, ఛంబల్, ఫరక్కా, శ్రీశైలం, తుంగభద్ర... వంటి ఎన్నో విలువైన ప్రాజెక్టు పనుల రూపకల్పన జరిగింది. గంగా, బ్రహ్మపుత్రా బేసిన్‌లో వరద నిర్మాణపు చర్యలపై ఆయన అందించిన సలహాలు, అందులో భాగంగా గాంధీనగర్, జవహర్ సాగర్, రాణప్రతాప్ సాగర్ నిర్మాణాలు డాక్టర్ రావు మేధాసంపత్తికి ప్రబల నిదర్శనాలు.

ప్రముఖ రచయితగా ఖ్యాతి

డాక్టర్ కె.ఎల్.రావు ఇంజినీర్‌గానే కాకుండా ప్రముఖ రచయితగా కూడా ఖ్యాతిని గడించారు. సాంకేతిక అంశాలకు సంబంధించిన దాదాపు 300 రచనలు చేశారు. 1947-48, 1953-54, 1957-58 సంవత్సరాలలో ఆయన రాసిన సిద్ధాంత పత్రాలకు ఆనాటి భారత రాష్ట్రపతి అవార్డులు లభించాయి. ఆయన రాసిన ఇండియాస్ వాటర్ వెల్త్ పుస్తకం ఈనాటికీ శాస్త్రవేత్తలకు ప్రామాణికంగా ఉంది. అనేక ప్రపంచ దేశాలను సందర్శించిన ఆయన దేశంలోనేగాక విదేశాలలో సైతం అనేక సంస్థలలో గౌరవ పదువులను అలంకరించారు. అపర భగీరథుడుగా పేరు గడించిన కె.ఎల్.రావుకు భారత ప్రభుత్వం 1967లో పద్మభూషన్ అవార్డును ప్రదానం చేసి గౌరవించింది. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీల మంత్రి వర్గాల్లో పనిచేసిన ప్రముఖుడు కె.ఎల్.రావు రూరల్ ఎలక్ట్రిషియన్ కార్పొరేషన్ రూపకల్పన చేశారు. గంగ, బ్రహ్మపుత్ర నదుల వరద నీటిని నిల్వ చేసి రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందినకరువు పీడిత ప్రాంతాలకు సాగునీటి సౌకర్యం కల్పించేందుకు డాక్టర్ కె.ఎల్.రావు రూపకల్పన చసిన నేషనల్ వాటర్ గ్రిడ్ ఒక అద్భుతమైన పథకం. భారతేదశాన్ని మరీ ముఖ్యంగా కృష్ణాజిల్లా అంతకన్నా ముఖ్యంగా జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాలు సస్యశ్యామలం అయ్యేందుకు కృషి చేసిన ప్రముఖుల్లో డాక్టర్ కె.ఎల్.రావు ఒకరు.

భారత మాత గొంతును నదీజలాలలతో తడిపి బంగారు సిరులు కురిపించిన మహనీయుల్లో ముఖ్యులు. బహుళార్థసార్థక ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు అన్న పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యలను అక్షరసత్యం చేశారు. కేంద్ర నీటిపారుదల శాఖ కేంద్ర కమిటీ అధ్యక్షుడుగా, కేంద్ర జలవనరులు, విద్యుత్ శాఖా మంత్రిగా పని చేసి భారతదేశ వ్యవసాయ రంగంలో పెనుమార్పులు తీసుకువచ్చి రైతాంగానికి మేలు చేశారు. నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిన తరుణంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వలు. జలవనరులు పంపిణీపై వివాదాలు, గంగానది ప్రక్షాళణ వంటి అంశాలపై చర్చలు జరుగుతున్న ఈ సమయంలో కెఎల్.రావు గురించిన తెలుగసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అచ్చతెలుగు ఆంధ్రవాడు. కెఎల్.రావు. వర్షం నీరు నిరుపయోగంగా సముద్రంలో కలిసిపోకుండా అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, ప్రాజెక్టుల్లో జలసిరులు నింపి, తద్వారా పంటలు పండించిన రైతుల ఇంట ధాన్యం పురులు నిండేలా చేశారు. ఈనాడు మన ముందు చర్చల్లో ఉన్న పులిచింతల, పోలవరం ఆయన కాలం నాడే డిజైన్ చేశారంటే నమ్మశక్యంగా ఉండదు. నదుల అనుసంధానం ఆయన కల. గంగా,కావేరీ నదుల అనుసంధానంతో ఆహార భద్రత లభిస్తుందని దూరదృష్టితో జలవనరుల నిర్వహణ గురించి అనేక ప్రాజెక్టులను ఎలా నిర్మించాలి, ఎక్కడ నిర్మించాలి అనే అంశాలను ఆయన ఆనాటి కేంద్ర మంత్రివర్గానికి వివరించారు.

హోదాలు, అవార్డులు

1958-59, 1959-60 సంవత్సరాల్లో ఆల్ ఇండియా ఇంజినీర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షులుగా ఉన్నారు. 1960లో నీటిపారుదల శాఖ కేంద్ర కమిటీకి అధ్యక్షులుగా పనిచేశారు. 1960లో ఆంధ్రా విశ్వవిద్యాలయం, 1968లో రూర్కీ యూనివర్శిటీల నుంచి గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. 1963లో భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' అవార్డుతో గౌరవించింది. అనేక నీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి ప్రజలకు ఆహారం, రైతులకు జీవనోసాధిని కల్పించిన ఆయనను 'ఫాదర్ ఆఫ్ వాటర్ మేనేజ్‌మెంట్ అండ్ అగ్రికల్చర్'గా పిలుస్తారు.

కెఎల్ స్మారకాలు

2006లో పులిచింతల ప్రాజెక్టుకు కెఎల్.రావు సాగర్‌గా నామకరణం చేశారు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి. విజయవాడ పాతబస్టాండ్ వద్ద కెఎల్.రావు విగ్రహం ఏర్పాటు చేశారు. గవర్నర్‌పేటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌లో కెఎల్.రావు భవన్ నిర్మించారు. ఆయన సమాధి ప్రకాశం బ్యారేజీ వద్ద ఉంది. ఆయన స్మారక చిహ్నాలను సంరక్షించి ముందు తరాలకు స్ఫూర్తినందించే కేంద్రాలుగా మలచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. డాక్టర్ కె.ఎల్.రావు 1986 మే 18న కన్నుమూశారు.

Engineers' Day Greetings..
భారతీయ ఇంజనీరింగ్ రంగానికి ఊపిరి పోసిన
మహామేధావి అంతర్జాతీయ స్థాయిలో
భారత జాతిని నిలిపిన మహనీయుడు
డా|| మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి
జయంతి సందర్భంగా భావి భారత ఇంజనీర్లకు
ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు



AHUVA ELECTRONICS & Tech.Ltd.,
SAMPATH HYDDRO TECHNOLOGY PVT.Ltd.
VISAKHAPATNAM

Engineers' Day Greetings..

Our Tribute to the Greatest Engineering
Father of the Nation
SRI MOKSHAGUNDAM VISVESVARAYA
on 15th September Engineers Day
Wishing Every Mechanical & Electrical
Engineers a Very Happy and Joyous Engineer's Day

CH.RAM PRASAD
Chief Mechanical Engineer (I/C) Visakhapatnam Port Aurthority

V.M.VENKATESWARA RAO
Dy. Chief Mechanical Engineer
Visakhapatnam Port Aurthority

M.N.S.S.Singh
Superintending Engineer (Mechancial)
Visakhapatnam Port Aurthority

K.VENU GOPAL
Superintendent Engineer (Mechanical)
Visakhapatnam Port Aurthority

T.KIRAN KUMAR
Executive Engineer (Electrical)
Visakhapatnam Port Aurthority

Engineers' Day Greetings..

ఇంజనీరింగ్ రంగంలో పితామహులుగా పేరుగాంచిన
భారతరత్న శ్రీ మోక్షగుండం
విశ్వేశ్వరయ్య గారి జయంతి సందర్భంగా
ఎ.పి.ఇ.పి.డి.సి.ఎల్.
ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ వారికి
ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు

G.VENKATESWARA RAO A.E.E.
NSTL Operation Circle,
APEPDCL, Visakhapatnam.

Engineers' Day Greetings

ఇంజనీరింగ్ వృత్తికే భాష్యం పలికిన
మహనీయులు, భావి భారత ఇంజనీర్లకు
స్ఫూర్తి ప్రదాత, భారతరత్న
శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి,
జయంతి సందర్భంగా...
ఇంజనీర్స్ డే
శుభాకాంక్షలు....

D.N.MURTHY S.E.
D.N.R.SUDHAKAR E.E.
B.SANDHYA Dy. E.E.
K.RAJESH CHANDRA Dy. E.E.
APTIDCO, Visakhapatnam

పాలనలోనూ విశేష కీర్తి

ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు
భారతరత్న ఇంజనీరింగ్ పితామహులు
శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి పటిష్టమైన
ఇంజనీరింగ్ విధానానికి రూపకల్పన చేసి ఎందరో ఇంజనీర్ల
భవిష్యత్‌కు పూనాది వేసిన ఆ మహానుభావుని జయంతి
సందర్భంగా విశాఖపట్నం పోర్టు అథార్టీ సివిల్ ఇంజనీరింగ్
డిపార్టుమెంట్ వారికి ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు
P. GOVINDA REDDY INFRASTRUCTURE
ENGINEERS & CONTRACTORS
Visakhapatnam

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలకు మన్ననలు

ప్రజాశక్తి-విశాఖపట్నం

మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీరుగానే కాకుండా పాలనాదక్షునిగా కూడా విశిష్ట కీర్తి ప్రతిష్టలు సంపాదించారు. మైసూరు రాష్ట్రంలో దివానుగా ఉన్న కాలంలో ఆ రాష్ట్ర పరిపాలనలో సమూల మార్పులు తీసుకొచ్చారు. ఏ సమస్యనైనా పరిష్కరించాలంటే శాస్త్రబద్ధంగా, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని విశ్వేశ్వరయ్య నమ్మేవారు. మైసూరు ఆర్థిక వ్యవహార మండలి సంస్థను ఏర్పాటు చేసి, దానికి స్వయంగా ఆయనే సారధ్యం వహించారు. విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం తదితర అంశాలను ప్రత్యేకంగా పరిశీలించేందుకు ఈ మండలిలో మూడు కమిటీలు నియమించారు. గణాంక వివరాలు సేకరించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజల్లో విస్తృతంగా వ్యాపింపజేయడం, ప్రయోగాత్మకంగా ప్రజలకు శిక్షణ ఇచ్చి, వారు తొందరగా ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి సాధించాలనే ప్రేరణ కలిగించేందుకు ఆ మండలికి రాష్ట్ర వ్యాప్తంగా శాఖోపశాఖలను నెలకొల్పారు. మైసూరు రాష్ట్రాన్ని మహారాజా చామరాజ వడియార్ బహద్దూర్‌కు అప్పగించే విధంగా వైస్రాయితో చర్చించి ఒప్పందం కుదర్చడంలో విశ్వేశ్వరయ్య ఘన విజయం సాధించారు. ఈ ఒప్పందం ఫలితంగా మహారాజా హోదా పెరగడంతో పాటు మరిన్ని అధికారాలు, స్వయం పరిపాలనా స్వేచ్ఛ లభించాయి. మైసూరు రాష్ట్రంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన సాగించేందుకు విశ్వేశ్వరయ్య ఎంతో కృషి చేశారు. రాచరికంలో ప్రజాస్వామ్యమేమిటని చాలామందికి ఆశ్చర్యం కలగవచ్చు. కానీ, ప్రజా ప్రతినిధులు తమ ప్రాంత సమస్యలను ప్రభుత్వానికి విన్నవించుకునే విధంగా విశ్వేశ్వరయ్య ఒక

ప్రతినిధుల సభ ఏర్పాటుచేశారు. అందులో ప్రజల తరపున మాట్లాడగల కొందరిని ప్రతినిధులుగా నియమించారు. ఈ సభ రాష్ట్ర బడ్జెట్‌పై కూడా చర్చించే విధంగా మహారాజావారి అనుమతి సంపాదించారు. రానురానూ మరిన్ని అధికారాలు ఈ సభకు లభించాయి. స్థానిక స్వపరిపాలనను మెరుగు పరిచేందుకు కూడా ఆయన అనేక చర్యలు తీసుకున్నారు. అంతవరకూ జిల్లా బోర్డులపై ఆధిపత్యం చెలాయిస్తున్న డిప్యూటీ కమిషనర్లను తొలగించి జిల్లా బోర్డు అధ్యక్షులుగా అనధికారులను నియమించారు. తాలూకా, జిల్లా బోర్డుల్లో ప్రజలచేత ఎన్నికయ్యే ప్రతినిధుల సంఖ్యను పెంచారు. ఆ సంస్థలకు ఎక్కువ మొత్తంలో ఆర్థిక వనరులు కూడా సమకూర్చారు. పాలనా యంత్రాంగం సక్రమంగా పని చేసేందుకుగానూ ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రతిభకు ప్రముఖ స్థానం కల్పించాలని ఆయన పట్టుపట్టారు. ఇండియన్ సివిల్ సర్వీస్ మాదిరిగా మైసూర్ సివిల్ సర్వీస్ పోటీ పరీక్షను ఆయన ఏర్పాటు చేశారు. దీనిద్వారా సమర్థులైనవారిని ప్రభుత్వోద్యోగాల్లోకి తీసుకునేవారు. ఆకస్మిక తనిఖీల ద్వారా పాలనా యంత్రాంగంలో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పడానికి విశ్వేశ్వరయ్య నిరంతరం ప్రయత్నించేవారు. తాను సకాలంలో విధులకు హాజరవడమే కాకుండా, ఉద్యోగులంతా సకాలంలో హాజరయ్యేలా చూసేవారు. ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకుగానూ తరచుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించేవారు. ప్రతి తాలూకాలో ఉన్న సహజవనరులను ప్రజల అవసరాలకు ఏవిధంగా వినియోగించాలో వివరించేవారు. ఆ విధంగా సూక్ష్మస్థాయి ప్రణాళికలు రూపొందించేవారు.

విద్యారంగానికి విశేష ప్రాధాన్యత ఇచ్చిన ఆయన కొన్ని కేంద్రాల్లో నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. దీనిని రానురానూ రాష్ట్రవ్యాపితం చేశారు. 1917లో మైసూరు మహారాణి కళాశాలలో పట్టభద్ర స్థాయి వరకూ విద్యను ప్రవేశపెట్టి దానిని ప్రథమ శ్రేణి కళాశాలగా మార్చారు. ఆ ఏడాదే విద్యార్థినులకు ప్రత్యేకంగా హాస్టళ్లు కూడా ప్రారంభించారు. ఆనాటికి భారతదేశంలో తనకంటూ ప్రత్యేకించి విశ్వ విద్యాలయం ఏర్పాటు చేసుకున్న తొలి రాష్ట్రం మైసూర్. వృత్తి శిక్షణ కోసం 1913లో బెంగళూరులో జయచామరాజేంద్ర వృత్తి శిక్షణా సంస్థను ఏర్పాటుచేశారు. దీనికి విశ్వేశ్వరయ్య రూ.2 లక్షల విరాళం ఇచ్చారు. దివానుగా ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ ఉద్యోగులందరినీ కలుపుకు పోవడంలోనూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, విశ్వేశ్వరయ్య మంచి పాలనాదక్షునిగా ఖ్యాతి గడించారు.

ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు
భారతీయ ఇంజనీరింగ్ రంగానికి
ఊపిరి పోసిన మహామేధావి,
అంతర్జాతీయ స్థాయిలో
భారత జాతిని నిలిపిన మహనీయుడు
డా॥ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి
జయంతి సందర్భంగా
భావి భారత ఇంజనీర్లకు
ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు
G.SURESH BABU
Executive Engineer
AP State Police Housing Corporation
Visakhapatnam-1 & 2 Divisions and Garividi Division

పనిపైనే మోక్షగుండం ధ్యాస

ప్రజాశక్తి- విశాఖపట్నం

ఉద్యోగిగా ఉన్నా, బాధ్యుడైన అధికారిగా ఉన్నా మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎప్పుడూ పని గురించే తపనపడేవారు. ఆ శ్రద్ధే ఆయణ్ని ఆ స్థాయికి చేర్చింది. ఏ ఒక్కరైనా పని చేయకుండా ఉండటాన్ని ఆయన సహించలేకపోయేవారు. 'మన దేశ దౌర్భాగ్యం సోమరితనం. దూరంగా ఉండి చూస్తే అందరూ పనిచేస్తున్నట్టు కనబడతారు. దగ్గరగా చూస్తే ఒక్కడు మాత్రమే పని చేస్తూంటాడు. ఒకడు గోళ్లు గిల్లుకుంటూ కూచుంటాడు. మరొకడు నడుం వాలుస్తాడు. ఇంకొకడు వీళ్లతో కబుర్లు చెప్తాడు. ఇదే మన ముఖ్యమైన లోపం' అని అనేవారు. దివానుగా ఉన్నకాలంలో విశ్వేశ్వరయ్య ఓ గ్రామానికి వెళ్లారు. గ్రామస్తులు ఆ ఊరిలో బాగా పేరొందిన వ్యక్తిని చూపుతూ, 'నలుగురు తినగల తిండి అతనొక్కడే తినగలడు' అని చెప్పారు. అప్పుడు విశ్వేశ్వరయ్య 'నలుగురు చేసే పని ఆ ఒక్కడే చేయగలడా?' అని అడిగారట. పని ప్రాధాన్యత గురించి ఒకానొక సందర్భంలో చెప్తూ 'గుర్తుంచుకో. నీ పని కేవలం రైలు క్రాసింగును ఊడ్చడమే కావచ్చు. కానీ, ప్రపంచంలో మరెవ్వరూ ఏ రైలు క్రాసింగూ ఉంచనంత శుభ్రంగా నువ్వు దాన్ని ఉంచ గలగాలి' అని అన్నారు. అంటే ఎవరి పనికి వారు అంకితమవ్వాలని, శ్రద్ధాసక్తులతో చేయాలని చెప్పారు.

'ప్రతి ఒక్కరూ దేశభక్తీ, పనిలో నైపుణ్యం అలవర్చుకుంటే ఈ దేశ ప్రగతిని ఏ ఒక్కరూ అడ్డుకోలేరు' అని అనేవారు. కష్టపడి పని చేయండి, శ్రమించి చేసే పని చంపదు. మనోవ్యధే మరణానికి కారణం అని విశ్లేషించారు. 'పని చేయకుండా తుప్పు పట్టి పోవడం కంటే పని చేస్తూ అరిగి పోవడం మంచిది' అంటూ పని ప్రాధాన్యతను, గొప్పతనాన్ని ఒక్క వాక్యంలో వివరించారు.

ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు
Our Tribute to the Greatest Engineering
Father of the Nation
SRI MOKSHAGUNDAM
VISVESVARAYA on 15th September
Engineers Day Wishing
Every Port Authority
All Engineers a Very Happy and
Joyous Engineer's Day
KVC INFRASTRUCTURES
ENGINEERING CONTRACTORS
Plot No. 176, Sector-4, M.V.P.Colony,
Visakhapatnam-530 017

విశ్వేశ్వరయ్యకు పురస్కారాలు

ప్రజాశక్తి- విశాఖపట్నం

విశ్వేశ్వరయ్య అనేక వేదికల నుంచి పురస్కారాలు అందుకున్నారు. 1955 సెప్టెంబర్ 7న భారతరత్నను భారత ప్రభుత్వం ప్రదానం చేసింది. 1904లో లండన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజినీర్స్ సంస్థ గౌరవ సభ్యత్వం, 1906 కెయిజర్-ఇ-హింద్ స్వర్ణ పతకం, 1911 కంపానియన్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్ ఢిల్లీ దర్బారులో బిరుదు, 1921 కలకత్తా విశ్వ విద్యాలయంచే డిఎస్‌సి గౌరవ ప్రశస్తి, 1931 బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌డి గౌరవ పట్టా, 1937 బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌డి గౌరవ పట్టా, 1943 ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) గౌరవ శాశ్వత సభ్యులుగా ఎంపిక, 1944లో అలహాబాద్ విశ్వ విద్యాలయంచే డిఎస్‌సి గౌరవ పట్టా, 1947 ఆంధ్రా విశ్వవిద్యాలయంచే డిఎస్‌సి గౌరవ పట్టా, 1948 మైసూరు విశ్వ విద్యాలయంచే గౌరవ డాక్టరేట్, 1953 ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి డి.లిట్ పట్టా, 1953 ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ (ఇండియా)చే విశిష్ట సభ్యత్వ సత్కారం, 1958 జాదవ్‌పూర్ విశ్వ విద్యాలయంచే డిఎస్‌సి గౌరవ పట్టా, 1958 రాయల్ ఏషియాటిక్ సొసైటీ కౌన్సిల్ (బెంగాల్)చే దుర్గాప్రసాద్ ఖైతాన్ మెమోరియల్ స్వర్ణపతక సత్కారం, 1959లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ వారిచే విశిష్ట సత్కారం అందుకున్నారు.

మహా మనిషి..

మోక్షగుండం విశ్వేశ్వరయ్య

(మొదటి పేజీ తరువాయి..) స్థానంలో పట్టా పుచ్చుకున్నారు.

ఆ రోజుల్లో ఇంజినీరింగ్‌లో ఉన్నత శిక్షణకు బెంగుళూరులో వీలుండేది కాదు. మైసూరు సంస్థానం దివాన్‌గా ఉన్న రంగాచార్లు విశ్వేశ్వరయ్యకు విద్యార్థి వేతనం మంజూరు చేశారు. పూనా ఇంజినీరింగ్ కళాశాల నుంచి 1883 నవంబర్‌లో ఆయన ఎల్‌సిఇ, ఇసిఎల్ పరీక్షల్లో ముంబయి రాష్ట్రం మొత్తమ్మీదే ప్రథముడిగా ఉత్తీర్ణులయ్యారు. అత్యుత్తమ విద్యార్థిగా నిలిచిన ఆయన 'బర్క్‌లే' బంగారు పతకం అందుకున్నారు. పూనాలో చదువుకునే రోజుల్లో సెలవులకు విశ్వేశ్వరయ్య చిక్‌బళ్లాపూర్ వచ్చేవారు. ఆ ఊరిలోనే ఉపాధ్యాయులుగా ఉన్న రామచంద్ర శాస్త్రిగారి కుమార్తెతో ఆయనకు వివాహం జరిగింది. ఆ రోజుల్లో బాల్య వివాహాలు మామూలే. విశ్వేశ్వరయ్య తల్లి కోడలికి సావిత్రి అనే పేరు పెట్టింది. విశ్వేశ్వరయ్య భార్య, తల్లితో పూనాలో కాపురం పెట్టారు. ఆ వాతావరణం సరిపడకపోవడంతో తల్లి తిరిగి చిక్‌బళ్లాపూర్ వచ్చింది. 1888 అక్టోబర్ 7న విశ్వేశ్వరయ్యకు మగ సంతానం కలిగింది. ప్రసవానంతరం భార్య, బిడ్డ ఇద్దరూ మరణించారు. అనంతరం తల్లి ఆయనకు మరో వివాహం చేసింది. ఈసారి కూడా కోడలికి సావిత్రి అనే పేరు పెట్టింది. ఈసారి కూడా ప్రసవానంతరం భార్య, బిడ్డ కన్ను మూశారు. తల్లి వెంకటలక్ష్మమ్మ మూడోసారి కూడా వివాహం చేసింది. అయితే, ఆమెతో విశ్వేశ్వరయ్యకు సరిపడలేదు. దీంతో, మేనమామను సంప్రదించి ఆమెకు విడాకులిచ్చారు. జీవితాంతం ఆమెకు భరణం కూడా ఇచ్చారు.

విశ్వేశ్వరునికి పుష్పాంజలి

బొంబాయి ప్రభుత్వంలో ఉద్యోగం

ఇంజినీరింగ్ పరీక్షల్లో బొంబాయి రాష్ట్రంలోనే ప్రథముడిగా నిలవడం ఆయన జీవితాన్ని గొప్ప మలుపు తిప్పింది. రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి బొంబాయి ప్రభుత్వంలో ఉద్యోగం ఇవ్వడం ఆనాటి ఆనవాయితీ. దీని ప్రకారం 1884 మార్చి నెలలో విశ్వేశ్వరయ్య బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ వర్క్స్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీరుగా నియమితులయ్యారు. పంజ్రా నదీ జలాలను దతారి గ్రామానికి 'సైఫన్' పద్ధతి ద్వారా సరఫరా చేసే బాధ్యతను బొంబాయి ప్రభుత్వం విశ్వేశ్వరయ్యకు అప్పగించింది. ఆ ప్రాంతం కొండలమయం. పైగా, విపరీతమైన వర్షాలు కురుస్తున్నాయి. అయినప్పటికీ, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆ పనిని విజయవంతంగా ఆయన పూర్తి చేశారు. ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు. ఆ సమయంలోనే మలేరియా వ్యాధిబారిన పడటంతో తనను బదిలీ చేయాల్సిందిగా కోరారు. దీంతో, ఆయనను పూనాలో రహదార్లు, భవనాల విభాగానికి బదిలీ చేశారు.

అమోఘం.. విశ్వేశ్వరుని సేవలు

1904లో విశ్వేశ్వరయ్య బొంబాయి రాష్ట్ర శానిటరీ ఇంజినీరుగా నియమితులయ్యారు. ఆ కాలంలో మన దేశం నుంచి ఇంగ్లాండ్‌కు సూయెజ్ కాలువ ద్వారా నౌకలు వెళ్లేవి. ఈ కాలువ ప్రవేశ ద్వారంవద్ద ఏడెన్ రేవు పట్టణం ఉండేది. ఈ పట్టణం పాలనా బాధ్యతలు బొంబాయి రాష్ట్రంపై ఉండేవి. ఏడెన్ పట్టణంలో నీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఆ రోజుల్లో సముద్ర జలాలను ఆవిరిగా మార్చి, వాటిని గొట్టాల ద్వారా పట్టణానికి చేరవేసి తరువాత దానిని నీరుగా మార్చుకునేవారు. దీనివల్ల ఎంతో వ్యయం అయ్యేది. ఈ సమస్యను పరిష్కరించే పనిని బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం విశ్వేశ్వరయ్యకు అప్పగించింది. 1906లో ఆయన ఏడెన్ పట్టణం వెళ్లారు. పట్టణానికి 18 మైళ్ల దూరంలోని లహేజ్‌వద్ద బావులు తవ్వి, చుట్టుపక్కల కొండల నుంచి వచ్చే వర్షపు నీటిని అందులో నిలువ చేసి, అక్కడి నుంచి ఆ నీటిని ఏడెన్ పట్టణానికి తరలించేవిధంగా విశ్వేశ్వరయ్య పథకం రూపొందించారు. ఈ పథకం ద్వారా ఏడెన్ పట్టణ నీటి సమస్య తీరింది. ఏడెన్ పట్టణంలో ప్రజారోగ్యం కోసం భూగర్భ మురుగు కాలువలు నిర్మించి అక్కడి ప్రజల మన్ననలందుకున్నారు విశ్వేశ్వరయ్య. ఆయన కృషిని ప్రశంసిస్తూ ప్రభుత్వం 'కెయిజర్-ఇ-హింద్' స్వర్ణ పతకంతో సత్కరించింది.

ఉద్యోగానికి రాజీనామా

భారతీయులపై బ్రిటిష్ అధికారులు చిన్నచూపు చూడటాన్ని విశ్వేశ్వరయ్య సహించలేకపోయేవారు. అన్నివిధాలా తాను చీఫ్ ఇంజినీర్ పదవికి అర్హుడినైనప్పటికీ, ఆ పోస్టును బ్రిటిష్‌వారికే కేటాయించడంపట్ల ఆయన ఎంతో ఆవేదన చెందారు. చివరకు దీనికి నిరసనగా ఆయన తన ఉద్యోగానికి 1908లో రాజీనామా చేశారు. ఆయన రాజీనామా లేఖను చూసిన గవర్నర్ సిడెన్‌హాం ఆశ్చర్యపోయారు. దీనిపై విశ్వేశ్వరయ్యకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అప్పటికి ఆయన ఉద్యోగంలో చేరి 23 ఏళ్లు అయింది. మరో రెండేళ్లు పని చేస్తే పింఛను లభించేది. అయినప్పటికీ 'భారతీయుల ప్రతిభను గుర్తించనప్పుడు పదవి ఎందుకు?' అని ప్రశ్నిస్తూ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. గవర్నర్ ఆయనకు పూర్తి పింఛను మంజూరు చేస్తూ, రాజీనామాకు కూడా అంగీకరించారు.

హైదరాబాద్ సంస్థానంలో...

ప్రభుత్వోద్యోగానికి రాజీనామా చేసిన అనంతరం, అమెరికా, యూరప్, కెనడా తదితర దేశాల్లో పర్యటించారు. 1908 సెప్టెంబరు 28న హైదరాబాద్ నగరం మూసీనది వరద తాకిడికి గురైంది. నగరాన్ని వరదల నుంచి కాపాడి, మంచినీటి వసతి, నగర పునర్నిర్మాణం, భూగర్భ మురుగు కాలువలు నిర్మించాల్సిందిగా నైజాం నవాబు విశ్వేశ్వరయ్యను కోరాడు. 1909 ఏప్రిల్ 15న విశ్వేశ్వరయ్య ఆ పదవిని చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన మూసీ నది వరదలను అరికట్టేందుకు అవసరమైన పథకం రూపొందించే పని చేపట్టారు. మూసి, దాని ఉపనది ఇయాసి నదుల పరీవాహక ప్రాంతాలను విశ్వేశ్వరయ్య పరిశీలించారు. అనంతరం, హైదరాబాద్ నగరానికి 13.5 కిలోమీటర్ల దూరంలో మూసీ నదిపై ఒకటి, 10.5 కిలోమీటర్ల దూరంలో ఇయాసి నదిపై మరోటి జలాశయాలు నిర్మించాలని, తద్వారా వరదలను అరికట్టవచ్చని సూచించారు.

అయితే, ఈ పనులు పూర్తయ్యేవరకూ ఆయన హైదరాబాద్ సంస్థానంలో పని చేయలేదు. ఆ తరువాత ఐదారుసార్లు ఆయన హైదరాబాద్ సందర్శించి ఆ పనులు జరుగుతున్న తీరు పరిశీలించారు. 1930లో నైజాం నవాబు కోరిక మేరకు హైదరాబాద్ నగర ప్రజల అవసరాలు గుర్తించి, వాటిని తీర్చేందుకు అవసరమైన సూచనలు చేస్తూ విశ్వేశ్వరయ్య సమగ్ర నివేదిక అందించారు. హైదరాబాద్ నగర మురుగునీటి పారుదల పథకం కూడా రూపొందించారు. బ్రిటిష్ రెసిడెంట్ కోరిక మేరకు సికింద్రాబాద్‌కు కూడా మురుగునీటి పారుదల పథకం రూపొందించారు.

మైసూరు సంస్థానంలో...

మైసూరు మహారాజా కోరికపై 1909 నవంబరు 15న విశ్వేశ్వరయ్య మైసూరు సంస్థానం చీఫ్ ఇంజినీరుగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మూడేళ్లపాటు అందించిన విశిష్ట సేవలకు సంతృప్తి చెందిన మహారాజా విశ్వేశ్వరయ్యను 1912లో దివాన్‌గా నియమించారు. ఈ కాలంలోనే కృష్ణరాజసాగర్ ఆనకట్ట జలవిద్యుచ్ఛక్తి పథకం, భాద్రావతి ఉక్కు కర్మాగారం, బ్యాంక్ ఆఫ్ మైసూర్, మైసూరు యూనివర్సిటీ, మైసూర్ శాండల్ సబ్బులు, కన్నడ సాహిత్య పరిషత్తువంటివెన్నో రూపుదిద్దుకున్నాయి. విద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి కూడా ఎంతో కృషి చేశారు. మహారాజాతో దూరం పెరగడంతో ఆయన 1918 డిసెంబర్ 9న దివాన్ పదవికి రాజీనామా చేశారు.

దేశవ్యాప్తంగా సేవలు

తదనంతర కాలంలో ఆయన సేవలు దేశవ్యాప్తంగా విస్తరించాయి. 1937లో ఒడిశాలోని మహానది వరదలవల్ల అపారమైన నష్టం జరిగింది. ఈ వరదల నిరోధానికి తగు సూచనలివ్వాల్సిందిగా విశ్వేశ్వరయ్యను గాంధీజీ కోరారు. అప్పటికి విశ్వేశ్వరయ్య వయస్సు 76 సంవత్సరాలు. వయస్సు మీద పడుతున్నా మహానదీ పరీవాహక ప్రాంతాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, సముచిత పథకాన్ని సూచించారు. ఒడిశా ప్రభుత్వం ఆ పథకాన్ని అమలు చేసింది. ఒడిశా ప్రభుత్వం తనకు పంపిన గౌరవ ధనాన్ని ఆయన తిప్పి పంపుతూ, గాంధీజీ ఆదేశం మేరకే తాను సేవలు అందించానని పేర్కొన్నారు. 1939లో బెంగుళూరులో విమాన కర్మాగార పథకం రూపకల్పనలో కూడా ఆయన తన సేవలు అందించారు. విశాఖపట్నంలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్ నిర్మాణంలో ఎదురైన అవరోధాన్ని అధిగమించేందుకు ఆయన చక్కని సూచన అందించారు. 1945లో గంగానదిపై వంతెన నిర్మించాలని రైల్వే బోర్డు నిశ్చయించింది. ఈ వంతెనను ఎక్కడ నిర్మించాలనే విషయమై భిన్నాభిప్రాయాలు తలెత్తాయి.

ఈ అంశాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించి సరైన సూచన ఇవ్వాల్సిందిగా విశ్వేశ్వరయ్యను నాటి ప్రధాని నెహ్రూ కోరారు. అప్పటికి 90 ఏళ్లు దాటినా, విశ్వేశ్వరయ్య తన సమ్మతి తెలిపారు. అనంతరం బి.సి.బైజాల్, బి.బి.వర్మ, వి.పి.భండారీ, పి.బి.అద్వానీలను తనకు సహాయకులుగా నియమించాల్సిందిగా కోరారు. ఈ సమితి కార్యదర్శిగా బైజాల్‌ను నియమించారు. ఈ సమితి కార్యక్రమాలకు, పర్యవేక్షణకు ఒక రైలుబండిని, నదిపై ఎత్తు నుంచి పరిశీలించడానికి ఒక విమానం ఏర్పాటు చేశారు. ఈ సమితి పాట్నా, కలకత్తా, ఖాట్మండ్ తదితర ప్రాంతాలకు వెళ్లి అనేకమంది అభిప్రాయాలు సేకరించింది. అన్ని అంశాలూ పరిశీలించి మొఖామే వద్ద వంతెన నిర్మించాల్సిందిగా సూచించారు. ఈ వంతెన నిర్మాణం 1953లో ప్రారంభమై, ఆరేళ్లలో పూర్తయింది.

నిండు నూరేళ్లూ జీవితం

ఆయన చదివింది ఇంజనీరింగే అయినా... వ్యవసాయం... నీటి పారుదల... పాలనా వ్యవహారాలు... పరిశ్రమలు... ఇలా ఎన్నో రంగాల్లో విశిష్ట సేవలు అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. విశ్వేశ్వరయ్యవంటి వ్యక్తి ఇటీవలికాలంలో మరొకరు కనపడరు. అటువంటి విశిష్ట వ్యక్తి 101 సంవత్సరాల సంపూర్ణ జీవితం గడిపి... 1962 ఏప్రిల్ 14 ఉదయం 6.15 గంటలకు బెంగుళూరులో తుది శ్వాస విడిచారు. భారతదేశ చరిత్రలో కీర్తిశేషులుగా నిలిచిపోయారు.

ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు

ఇంజనీరింగ్ వృత్తికే భాష్యం పలికిన మహనీయులు, భావి భారత ఇంజనీర్లకు స్ఫూర్తి ప్రదాత, భారతరత్న శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి, జయంతి సందర్భంగా...
ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు
G.Sudhakara Rao AEE
Operation Section, Gajuwaka, VSP.

ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు

ఇంజనీరింగ్ వృత్తికే భాష్యం పలికిన మహనీయులు, భావి భారత ఇంజనీర్లకు స్ఫూర్తి ప్రదాత, భారతరత్న శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి, జయంతి సందర్భంగా...
ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు
O.LOKESH AE
Operation Section, Mindi, VSP.

ఇంజనీరింగ్ వృత్తికే భాష్యం పలికిన మహనీయులు, భావి భారత ఇంజనీర్లకు స్ఫూర్తి ప్రదాత, భారతరత్న శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి, జయంతి సందర్భంగా...
ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు

MONITOR ENGINEERING WORKES
SINCE 1987
ARCHITECTURE / CIVIL / STRUCTURAL
ELECTRICAL / MECHANICAL / AUTOMATION
ISO 9001 : 2015 Certified Company
LIG - 98, RAJEEV NAGAR, KURAMANNAPALEM, VISAKHAPATNAM - 530046, ANDHRA PRADESH, INDIA.
OFFICE/ FAX: +91 891 2701699,
MOBILE :- +91 9949465196. +91 8885000896
E-MAIL: CONTACT.MONITORENGGWORKS@GMAIL.COM,
INFO.MONITORENGGWORKS@GMAIL.COM,
MONITORENGG98@GMAIL.COM.

Engineer's Day Greetings
ఇంజనీరింగ్ విభాగంలో పితామహునిగా పేరుగాంచిన భారతరత్న అవార్డు గ్రహీత ఇంజీరింగ్ పితామహులు శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి, జయంతి సందర్భంగా
ఇంజనీర్లందరికీ శుభాకాంక్షలతో
M.VIJAYA BHASKAR S.E.
D.ATCHUM NAIDU E.E
P.MANMADHA RAO DY.E.E.
A.NAGESWARA RAO DY.E.E.
A.PHANI KUMAR DY.E.E.
M.SRINIVASA MURTHY EE(QC&S)
J.PRAMOD KUMAR DY.E.E.
G.S.N.VARMA, DY.E.E.
APMSIDC TECH. STAFF OF DIVISION



అద్భుత ఇంజనీరింగ్ ప్రతిభకు నిదర్శనం

కెకె రైల్వే లైన్

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఆంధ్రా ఊటీగా పిలవబడే అరకు మీదుగా విశాఖ-కిరండూల్ రైల్వే లైన్ ఉంది. ఛత్తీస్‌గఢ్ నుంచి విశాఖ నగరానికి ఇనుప ఖనిజాన్ని తరలించేందుకు అటవీ ప్రాంతంలో ఈ అద్భుత రైలుమార్గాన్ని ఇంజినీర్లు అభివృద్ధి చేశారు. విజయనగరం జిల్లా ఎస్.కోట సమీపంలోని బొడ్డవర నుంచి అరకులోయ సమీపంలోని కరకవలస వరకు ఎత్తయిన కొండల నడుమ సాగే రైలు ప్రయాణం అద్భుతమనే చెప్పాలి.కొండల్ని తొలిచి రైలు మార్గం వేశారు. ు. ఈ మార్గంలో మొత్తం 52 టన్నెల్స్ సొరంగాలు ఉన్నాయి. బొర్రా-చిమిడిపల్లి స్టేషన్‌ల మధ్య 900 మీటర్ల పొడవైన భారీ టన్నెల్ దాటేందుకు రైలుకు 20 నిమిషాలు పడుతుంది. మిగతా టన్నెల్స్ అన్నీ 200 మీటర్లలోపే ఉంటాయి. ఈ టన్నెల్స్‌లో ప్రయాణం అన్ని వయసుల వారికి మంచి అనుభూతి నిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ మార్గంలో రోజూ 10 వరకూ గూడ్స్‌రైళ్లు, రెండు ప్రయాణికుల రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రయాణికుల సౌకర్యార్థం కిరండోల్‌కు ఉదయం సమయంలో పాసింజరు రైలు రాత్రివేళల్లో జగదల్‌పూర్ వంటి ఎక్స్‌ప్రెస్ రైలు ఉన్నాయి. ఘాట్ మార్గం కావడంతో రైలు మెల్లగానే ప్రయాణిస్తుంది. బొర్రా గుహలు మీదుగానే పట్టాలు ఉండడం మరో ప్రత్యేకత. రైలు ప్రయాణించే సమయమంతా దట్టమైన అటవీ ప్రాంతం గుండానే సాగుతోంది. అద్భుతమైన జలపాతాలు మధ్యమధ్యలో దర్శనమిస్తుంటాయి. ప్రకృతి అందాలు, రమణీయతకు పెట్టింది పేరైన అరకు ప్రాంతంలో ఈ గుహలు ఇంజినీరింగ్ శిల్పుల విశిష్టతకు నిదర్శనంగా వెలుగొందుతోంది. విశాఖ నుంచి అరకు ప్రయాణికుల సౌకర్యార్థం 'విస్టాడాం' ఎసి కోచ్‌ను వేశారు. అద్దాల ఎసి రైలులో ప్రకృతి సోయగాలను తిలకించేందుకు దీన్ని ప్రవేశపెట్టారు.

అరకు ప్రయాణం.. అద్భుతం

విశాఖ-అరకు గుహల్లో ప్రయాణం ఒక మరచిపోని, చెరిగిపోని జ్ఞాపకం. బొర్రా-చిమిడిపల్లి స్టేషన్ల మధ్య 900 మీటర్ల టన్నెల్ పొడవు... రైలు దాటేందుకు 20 నిమిషాల సమయం... గుహల్లో ప్రయాణిస్తున్నంత సేపూ చీకటి... కొండ కోనల్లో కూ.. చుక్‌చుక్.. అంటూ రైలు ముందుకు సాగుతుంటే రైలులో ఉండే ప్రయాణికుల కేరింతలు.. చెప్పరాని అనుభూతిగానే చెప్పొచ్చు. అరకు వెళ్లా విశాఖ-కిరండూల్ రైలుమార్గం ఇంజినీర్లు చేపట్టిన అద్భుతమనే చెప్పాలి.

విజ్ఞాన ప్రపంచం..

విశ్వేశ్వరయ్య మ్యూజియం

ప్రజాశక్తి - విశాఖపట్నం :భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరుతో బెంగళూరులో మ్యూజియం ఏర్పాటైంది. ఇక్కడ ఒక ఆర్ట్ గాలరీ కూడా ఉంది. మ్యూజియం ప్రాంగణంలోకి ప్రవేశించగానే పెద్ద విమానం ఒక పక్కగా కనిపిస్తుంది. ఇక్కడ సోలార్ ప్యానల్స్, పాతకాలపు నీటితో పనిచేసే టర్బైన్ కనిపిస్తాయి. ఈ మ్యూజియం. ఇంజన్ హాల్, .ఎలక్ట్రానిక్స్, .ఫన్‌సైన్స్, అంతరిక్ష విజ్ఞానం, బయోటెక్నాలజీ- పరిణామం, జబెల్-హాల్ (ఎలక్ట్రానిక్స్), సైన్స్ ఫర్ చిల్డ్రన్ అని ఏడు విభాగాలుగా ఉంటుంది. అంతేగాక ఇక్కడ పిల్లలకు, పెద్దలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచే. నక్షత్ర దర్శనం, సైన్స్ నాటికల ప్రదర్శన, సైన్స్ క్విజ్ మొదలైన కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. రైట్ సోదరులు మొదటిసారిగా ఆకాశంలో విహరించిన విమానం నమూనా, రైట్ సోదరుల విమాన నమూనా చిత్రపటం, మొదటి విమానాల చరిత్రను తెలిపే వివరాలు, కింది భాగంలో ఉన్న ఇంజన్ హాల్‌లో వివిధ పాతకాలపు డీజిల్, పెట్రోల్ యంత్రాల నమూనాలు ఎన్నో ఉన్నాయి. పాత కాలపు ట్రాక్, గ్రావిటీ ఆధారంగా పనిచేసే పరికరం, ఒక మరను తిప్పుతుంటే బాల్స్ పైకి చేరి క్రమేపి కిందకు చేరడం గమనించవచ్చు. పురాతన కాలపు అచ్చు యంత్రం, లెత్ యంత్రం ఉన్నాయి.



బెంగళూరులోని విశ్వేశ్వరయ్య మ్యూజియంలో సైన్స్ గ్యాలరీ

విశాఖ షిప్‌యార్డుకు విశ్వేశ్వరయ్య సలహా

ప్రజాశక్తి-విశాఖపట్నం : దేశంలోని తొలి నౌకా నిర్మాణ కేంద్రం విశాఖపట్నంలోనే ఏర్పడిందనే విషయం అందరికీ తెలిసిందే. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటిషర్ల యుద్ధ నౌకలను జర్మనీ బాంబర్లు అదేపనిగా ముంచేశాయి. దీంతో, బ్రిటిష్ ప్రభుత్వం కొత్తగా నౌకలను నిర్మించు కోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇందులో భాగంగా భారతదేశంలో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటు చేయాలని భావించారు. ఇందుకోసం విశాఖపట్నాన్ని ఎంపిక చేసి, షిప్‌యార్డ్ నిర్మించాల్సిందిగా వాల్‌చంద్ హీరాచంద్‌ను నాటి బ్రిటీష్ ప్రభుత్వం కోరింది. హార్బరు లోపలికి ఓడలు ప్రవేశించే మెయిన్ ఛానల్‌లో ఇసుక మేటలు వేస్తుండటంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. దీనిని అధిగమించేందుకు ఓడలు ప్రవేశించే మార్గానికి ఎదురుగా సముద్రంలో అడ్డుకట్ట నిర్మించాలి. అయితే, ఇది కష్టమని బ్రిటిష్ ఇంజినీర్లు భావించారు.దీంతో,వారు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సలహా తీసుకున్నారు. ఈ ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించిన విశ్వేశ్వరయ్య అడ్డుకట్ట కట్టాల్సిన చోట రెండు పెద్ద ఓడలను సిమెంట్ దిమ్మలతో ముంచి ఉంచితే సమస్య పరిష్కారమవుతుందని సూచించారు. ఆ విధంగా విశాఖ షిప్‌యార్డ్ నిర్మాణంలో కూడా విశ్వేశ్వరయ్య సహాయ సహకారాలున్నాయి.



చారిత్రక కట్టడాలకు నెలవు విశాఖ

విశాఖపట్నం కలెక్టరేట్

ప్రజాశక్తి - కలెక్టరేట్

వందేళ్లు దాటినా నేటికీ చెక్కుచెదరని చారిత్రక కట్టడాలు విశాఖ సొంతం. అద్భుత ఇంజినీరింగ్ ప్రతిభకు అవి తార్కాణాలు. ఒక విధంగా చెప్పాలంటే నాటి నైపుణ్యానికి, ప్రాభవానికి ఇవి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. ఈ కట్టడాలు విశాఖకు వన్నె తెచ్చాయి. వీటిలో కొన్ని కట్టడాలు నేడు సేవా కేంద్రాలుగానూ మారాయి. కలెక్టరేట్, కెజిహెచ్, ఆంధ్ర విశ్వకళాపరిషత్, ఎవిఎన్, క్వీన్‌మేరీ స్కూల్, కమిషనరేట్, జడ్జి కోర్టులు, ఆంధ్రా మెడికల్ కళాశాలలు చరిత్రకు ఆనవాళ్లుగా భాసిల్లుతున్నాయి. కలెక్టరేట్ నిర్మాణం పూర్తయి వందేళ్లు దాటిందంటే అతిశయోక్తి కాదు. బ్రిటిష్ పాలకుల సాంకేతిక నైపుణ్యానికి, పనితీరుకు విశాఖ కలెక్టరేట్ భవన నిర్మాణం ఓ మచ్చు తునక. శతాబ్దానికిపైగా ప్రజలకు సేవలందిస్తూ నేటికీ చెక్కు చెదరలేదు. ప్రస్తుతం ఈ భవనం ఉన్న ప్రదేశంలో 1865కు పూర్వం కూడా కలెక్టర్ కార్యాలయమే ఉండేది. ఇంగ్లాండు నుంచి సముద్రయానం ద్వారా చేరుకోవడానికి వీలుగా ఉండడంతో ఆంగ్లేయులు విశాఖ కేంద్రంగా పరిపాలన సాగించారు. బ్రిటిష్ పాలకులు తమ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని పాత భవనం స్థానంలో కొత్తగా భవనాన్ని నిర్మించారు. రాళ్లు, ఇసుక, చెక్కసున్నం తదితర నిర్మాణ సామగ్రితో చేపట్టిన ఈ భవన నిర్మాణ పనులు 1865లో ఆరంభమై 1914 నాటికి పూర్తయ్యాయి. అత్యధిక భాగం రాళ్లతో నిర్మించారు. ఇతర నిర్మాణ సామగ్రి, స్టీలు ప్రత్యేకంగా ఇంగ్లాండు నుంచి రప్పించారు. భవనంలోకి గాలి, వెలుతురు బాగా వచ్చేలా సీలింగ్, వెంటిలేటర్లు ఏర్పాటు చేశారు. బ్రిటిష్ పాలకులు ఊహించినట్లే కలెక్టరేట్ ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలకు నెలవుగా మారింది.

కమిషనరేట్

బ్రిటిష్ కాలంలో నిర్మించిన భవనాల్లో విశాఖ పోలీసు కమిషనరేట్ కూడా పేరుగాంచింది. భారతదేశానికి మరో సంవత్సరంలో స్వాతంత్ర్యం సిద్ధిస్తుందనగా పోలీసు కమిషనరేట్‌లో పోలీసుల బూట్లు, ఖాకీ దుస్తుల అలికిడి వినిపించింది. 1946లో 18 మంది సిబ్బందితో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఎస్‌పి) శాంతి భద్రతల ప్రధాన కేంద్రంగా ఏర్పాటైంది. ఆ భవనాన్ని నేడు పోలీసు కమిషనరేట్‌గా పిలుస్తున్నారు.

ఆంధ్ర విశ్వకళాపరిషత్తు

ఆంధ్ర విశ్వకళాపరిషత్తు స్థాపనకు 1910లో బీజాలు పడ్డాయి. తెలుగు నేలపై ఆనాడు ఒక్క విశ్వవిద్యాలయమూ లేకపోవడం అప్పటి పెద్దలను ఆలోచింపజేసింది. తొలుత కేవలం నాలుగు బోధనాంశాలతో 1926 ఏప్రిల్ 26న ఆంధ్ర విశ్వవిద్యాలయం బెజవాడ మ్యూజియంలో లాంఛనంగా ప్రారంభమైంది. ఆరుగురు అధ్యాపకులు, 20 మంది పరిశోధకులు పనిచేసేవారు. 1930లో ఎయు బెజవాడ నుంచి విశాఖపట్నానికి మారింది. బ్రిటిష్ సాంకేతిక పరిజ్ఞానంతో రాళ్లతో ఇక్కడ భవనాలు నిర్మించారు.

క్వీన్ మేరీ స్కూల్

విశాఖ నగరంలో సుమారు 100కుపైగా మున్సిపల్ పాఠశాలలు ఉన్నా బ్రిటిష్ కాలం నుంచి ప్రభుత్వ నిర్వహణలో నడుస్తున్న పాఠశాల మాత్రం క్వీన్ మేరీ స్కూల్ ఒక్కటే. బ్రిటిష్ పాలకుల హయాంలో ప్రారంభమైన పాఠశాలలన్నీ క్రిస్టియన్ మిషనరీ సంస్థల నిర్వహణలో నడుస్తుండగా ఈ పాఠశాల మాత్రం ప్రభుత్వ నిర్వహణలోనే కొనసాగడం విశేషం. నగర పరిధిలో తొలి ప్రభుత్వ పాఠశాల ఇదే కావడం మరో విశేషం.

ఎవిఎన్ విశిష్ట ఇదీ..

1860లో విశాఖ నగరంలోని 'వెరాక్యులర్ స్కూల్'గా ప్రారంభమైంది. 1866లో హైస్కూల్‌గా మారింది. 1878లో హిందూ కళాశాలగా కళాశాల స్థాయికి చేరుకుంది. అనంతరం ఎవిఎన్‌గా అవతరించింది. యూరోపియన్ విద్యాంసుడు వింక్లర్ ఈ విద్యాలయానికి మొదటి హెడ్ మాస్టర్‌గా పనిచేశారు. ఈ కళాశాలలో చదివినవారు రాజకీయ నేతలుగా, రచయిత్రలుగా, పారిశ్రామిక వేత్తలుగా, శాస్త్రవేత్తలుగా ఎదిగారు.

ఆంధ్రా యూనివర్సిటీ

మోక్షగుండం పారిశ్రామికీకరణ ఆలోచనలు

ప్రజాశక్తి-విశాఖపట్నం

దేశంలో పేదరికాన్ని రూపుమాపాలంటే మన వ్యవసాయ పద్ధతులను ఆధునికీకరించడంతో పాటు అధునాతన పరిశ్రమలను ప్రారంభించడం కూడా అత్యంత అవశ్యమని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భావించేవారు. భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో అనేక చిన్న పరిశ్రమలు కూడా వాటికి అనుబంధంగా ఏర్పడతాయని, తద్వారా దేశాభివృద్ధి త్వరితగతిన జరుగుతుందని చెప్పేవారు. 'పారిశ్రామికీకరణ సాధించాలి లేదా నశించాలి. సమృద్ధిని సాధించాలి లేదా నశించాలి' అనేది ఆయన నినాదం. 'ప్లాన్డ్ ఎకానమీ ఫర్ ఇండియా' అనే పేరుతో రాసిన పుస్తకంలో దేశ పారిశ్రామిక సంపద పెంపొందించడానికి అవసరమైన ఒక సమగ్ర కార్యాచరణ పథకాన్ని విశ్వేశ్వరయ్య ప్రకటించారు.

మైసూరు దివానుగా ఆయన ఆ రాష్ట్ర పారిశ్రామికీకరణకు గట్టి పునాదులు వేశారు. వివిఎన్.సాంబశివఅయ్యర్ అనే నిపుణుడి సహకారంతో మైసూరు రాష్ట్రంలోని పారిశ్రామిక వనరులపై సమగ్ర సర్వే జరిపించారు. రాష్ట్రంలోని అటవీ వనరుల ఆధారంగా పారిశ్రామికాభివృద్ధి ఏ విధంగా చేయాలో పరిశీలన జరిపారు. ఆయన చేసిన కృషి ఫలితంగా ఇనుము ఉత్పత్తి చేసే కర్మాగారంతోపాటు, ప్రభుత్వరంగంలో సబ్బుల పరిశ్రమ, మంచిగంధపు నూనె కర్మాగారం, వివిధ లోహాల కర్మాగారాలు, అగ్గిపెట్టెల తయారీ పరిశ్రమ, ఇటుకలు, పెంకుల తయారీ పరిశ్రమలు, శ్రీకృష్ణ రాజేంద్ర నూలు ఉత్పత్తి కర్మాగారం, కేంద్ర ప్రభుత్వరంగంలో వస్త్ర పరిశ్రమ తదితర అనేక పరిశ్రమలు ఏర్పాటయ్యాయి.

అనేక కుటీర పరిశ్రమలను ప్రోత్సహించారు. మంచిగంధం చెక్కతోనూ, దంతంతోనూ బొమ్మలు తయారు చేసే పరిశ్రమలను, ఇతర పరిశ్రమలను ప్రోత్సహించారు. వీటన్నింటికీ తలమానికం భద్రావతిలో ఏర్పాటైన 'మైసూరు ఇనుము, ఉక్కు కర్మాగారం'. దీంతోపాటు కృష్ణరాజసాగర్ జలవిద్యుత్ కేంద్రం కూడా ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేశారు. బెంగళూరులో ఏర్పాటుచేసిన హిందూస్థాన్ ఏరోనాటిక్స్ వెనుక విశ్వేశ్వరయ్య కృషి ఎంతో ఉంది. ఈ విధంగా అనేక పరిశ్రమలను ప్రభుత్వ రంగంలోనే ప్రోత్సహించిన ఘనత విశ్వేశ్వరయ్యది.











సర్ ఆర్థర్ కాటన్ ఆలోచనలు

విశాఖ అభివృద్ధికి బాటలు

- సముద్ర అలలకు అడ్డుకట్టతో సహజసిద్ధ నౌకాశ్రయం ఏర్పాటు
- కాటన్ ఇంజనీరింగ్ ప్రతిభతో ఆర్‌కె బీచ్‌కు కొత్త రూపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ సాగర తీరంలో ఉవ్వెత్తున ఎగసిపడే కెరటాలు, ఆనందాన్నందించే అలల సవ్వడి మనసును ఇట్టే దోచేస్తాయి. దరికి చేరే కెరటాలను అడ్డుకోవడానికి మేం సిద్ధం అంటూ ఎదురునిలిచే నల్లటి రాళ్లు ఇవన్నీ నగరవాసులకు, సందర్శకులకు కనువిందు చేస్తుంటాయి. కానీ ఈ నల్లటి రాళ్ల వెనుక అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ చేసిన కృషి ఉందనే విషయం అందరికీ తెలియదు. ఏ ప్రాంతంలో పనిచేసినా ఆ ప్రాంత అభివృద్ధికి బాటలు వేసిన కాటన్ మహాశయుడు, విశాఖను మహానగరంగా తీర్చిదిద్దేందుకు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. అయినా వెరవకుండా, పట్టుదలతో శ్రమించి విజయ తీరాన్ని అందుకుని అందరితో 'శభాష్' అనిపించుకున్నారు.

సర్ ఆర్థర్ కాటన్‌ను విశాఖ స్మరించుకోవాల్సిన అవసరముంది. 179 ఏళ్ల క్రితం ఆయన వేసిన ప్రణాళికలే విశాఖను మహా నగరంగా తీర్చిదిద్దాయి. అయితే కాటన్ గురించి మనకెందుకు గోదావరి జిల్లా వాళ్లు చూసుకుంటారులే అనే వారూ నగరంలో ఉన్నారు. కానీ కాటన్ ఆలోచనలే విశాఖ అభివృద్ధికి బాటలు వేశాయని అతని గురించి తెలుసుకున్న వారు చెబుతారు. నగరంలో మనం సందర్శించి, ఆనందించే బీచ్ రూపకల్పన, సహజ నౌకాశ్రయం నిర్మాణానికి ప్రణాళిక, పురాతనమైన చర్చి నిర్మాణం తదితరాలు సర్ ఆర్థర్ కాటన్ ఇంజనీరింగ్ ప్రతిభకు తార్కాణాలేనని ఆయన జీవితచరిత్ర పుస్తకంలోని కొన్ని పేజీలు చెబుతున్నాయి. నిత్యం సందర్శకుల కేరింతలతో నిండి ఉండే బీచ్‌లో ఎగసిపడే అలలను అడ్డుకునే రాళ్లు కాటన్ ఆలోచనలకు నిదర్శనాలుగా కనబడుతున్నాయి.

179 ఏళ్ల క్రితం 1844లో కాటన్ విశాఖ ప్రాంతంలో డివిజనల్ సివిల్ ఇంజనీర్‌గా పనిచేశారు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం విశాఖలో ఒక క్రైస్తవ దేవాలయం నిర్మించాలని, సముద్రం ఒడ్డున కెరటాల తాకిడిని తగ్గించాలని భావించి అందుకుగాను కాటన్‌ను అధికారిగా నియమించింది. ఆయన డాల్ఫిన్ కొండపై సైనికుల కోసం నిర్మించిన పాత భవనంలో నివసించేవారు. డాల్ఫిన్ కొండ పైనుంచి దిగువనున్న సముద్రాన్ని, చుట్టూ ఉన్న సుందర దృశ్యాలను ఆయన నిత్యం పరిశీలించేవారు. తీరం వద్దకు వచ్చే ఎత్తయిన సముద్ర కెరటాలను చూసి, వాటి తీవ్రతను తగ్గించేందుకు పెద్ద బండరాళ్లను గుట్టలుగా తీరం పొడవునా వేయించాడు. ఆయన చేసిన ఈ చర్యను చూసి పెద్ద ఇంజినీర్లు ఎగతాళి చేసి చిన్నబుచ్చారు. కాలక్రమేణా బండరాళ్ల వల్ల ఎంతో మేలు జరిగినట్లు వారే గుర్తించారు. కెరటాల తాకిడి నుంచి ఒడ్డుకు జరిగే నష్టం తగ్గింది. క్రమంగా విశాలమైన బీచ్ ఏర్పడింది. అదే ఆర్‌కె.బీచ్ నేడు పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. బీచ్‌లో నేడు మనకు కనిపించే నల్లటి రాళ్లు నాటి కాటన్ ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనాలు.

విశాఖ కోసం కాటన్ కన్న కలలివి

విశాఖను ఒక ఆదర్శవంతమైన రేవు పట్టణంగా చేయడానికి కాటన్ అప్పట్లో పలు సూచనలు చేశారు. పంజాబ్ నుంచి, గంగానది లోయ నుంచి సముద్రతీరాన్ని అనుసరించి కాలువలు తవ్వి విశాఖపట్నానికి నీరు తీసుకురావచ్చని అప్పట్లో ఆయన కలలు కనేవారట. విశాఖ కోసం 1844లో కాటన్ తన అధికారులతో ఇలా మాట్లాడారు. 'హిందూ దేశ తూర్పు తీరంలో చల్లటి వాతావరణం కలిగినది విశాఖపట్నమే. ఇంగ్లాండుతో వర్తకానికి అనువైన ముఖద్వారమిది. సముద్రాన్ని ఆనుకుని డాల్ఫిన్ కొండ ఉన్నందున అత్యుత్తమ సహజ నౌకాశ్రయం ఏర్పాటు ఇక్కడ సులభం. డాల్ఫిన్ పక్కనే ఉన్న స్థలం క్రమంగా ఒక మహా నగరంగా మారుతుంది. విశాఖ నుంచి రాయపూర్ వరకు కాఫీ, చెరకు, పండ్ల తోటలు పెంచేందుకు అవకాశం ఉంది. డాల్ఫిన్ కొండకు పట్టణం వైపున లోతట్టు హార్బరు, సముద్రం వైపున ఔటరు హార్బరు కట్టవచ్చు. ఔటరు హార్బరును గ్రానైట్ (నల్ల సేనాపురాయి)తో కట్టవచ్చు.' అని ఎన్నో విలువైన మాటలను ఆయన అప్పట్లో అధికారులకు చెప్పారు.

ఆనాడు ఆయన చేసిన సూచనలన్నీ మంచి ఫలితాలనిచ్చాయి. 1972 నాటికి ఒక్కొక్కటీ ఆచరణలోకి వచ్చి హిందుస్థాన్ షిప్‌యార్డ్ పనిచేసి విశాఖపట్నం హార్బరు అభివృద్ధి చెందింది. ఈ విషయాలన్నీ డెల్టా శిల్పి సర్ ఆర్థర్ కాటన్ పుస్తకంలో 43, 44, 45, 46 పేజీలలో చక్కగా పొందుపరచబడి ఉన్నాయి. విశాఖ మహానగరంగా అభివృద్ధి చెందుతుందని ఆనాడు చేసిన సూచన ఆయన దూరదృష్టికి నిదర్శనం. ఆయన చేసిన సూచనలు పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చి ఉంటే నేడు ఉత్తరాంధ్రకు నీటి సమస్య ఉండేది కాదు.